మంగళవారం
14-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 322
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాఠశాలలకు మళ్లీ బాంబు బెదిరింపులు

లక్నో: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆకతాయిల ఆగడాలు రోజు రోజుకు శృతి మించుతున్నాయి. విమానాశ్రయాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ సమయంలో ఆయా సంస్థల సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. తాజాగా ఉత్తరప్రదేశ్ లక్నోలోని గోమతి నగర్‌లో కొన్ని పాఠశాలలకు సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులను గ్రౌండ్‌లోకి తరలించి... మీ పిల్లలను ఇంటికి తీసుకు వెళ్లాలంటూ తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందించింది.

పోటెత్తిన ఓటరు

- ఎండా, వాన లెక్కచేయని జనం
- సాయంత్రం 5 గంటలకే 68 శాతం నమోదు
- సమయం ముగిశాక 3,500 కేంద్రాల్లో కొనసాగిన పోలింగ్
- అనేక ప్రాంతాల్లో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ
- తెనాలి ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించిన ఓటరు
- తుమ్మకోటలో ఈవీఎంల ధ్వంసం
- తంగెడలో నాటుబాంబు దాడులు

2లో

ఓటర్లు పోటెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ ప్రజలు లెక్కచేయలేదు. అలాగే అనేకచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ జనం బెదరలేదు.

తాడిపత్రిలో ...

గురజాలలో పెట్రో బాంబుల దాడి

రీపోలింగ్ అవసరం రాదు

- ఈవీఎంలు దెబ్బతిన్న 8 కేంద్రాల్లో యంత్రాలు మార్చాం
- హింసాత్మక ఘటనలపై చర్యలకు ఆదేశం
- సీఈవో ముకేశ్ కుమార్ మీనా

2లో

రాష్ట్రంలో ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా రీపోలింగ్ నిర్వహించే అవసరం రాదని ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సోమవారం సాయంత్రం చెప్పారు.

కేజ్రీవాల్‌కు భారీ ఊరట

సీఎంగా తొలగించాలన్న పిటిషన్ కొట్టివేత

ఆ నిర్ణయం ఎల్జీదేనన్న సుప్రీం కోర్టు

న్యూదిల్లీ: దిల్లీ మద్యం విధానానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరెస్టయినందున దిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి అరవింద్ కేజ్రీవాల్‌ను తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సింది దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అని స్పష్టం చేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా ధర్మాసనం పేర్కొంది. అరెస్టు చేసిన తర్వాత ఆయన్ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరడం న్యాయబద్ధమైన విషయమని, కానీ దానికి చట్టపరమైన హక్కు లేదని స్పష్టం చేసింది. కాగా దీనికి సంబంధించిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు ఏప్రిల్ 10నే కొట్టివేసింది. అనంతరం పిటిషనర్ కాంత్ భాటి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు.కాగా పిటిషన్ విచారణ సందర్భంగా ఎల్జీ అధికారాలను కోర్టు ప్రస్తావించడంతో లెఫ్టినెంట్ గవర్నర్, అధికార ఆమ్ ఆద్మీ పార్టీ మధ్య కొత్త వివాదం తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా నిషేధిత సంస్థ

- మిగతా 2 లో

'ఇండియా' అధికారంలోకి రాగానే
జైలు నుంచి బయటికి వస్తా

2లో

అంతా ప్రశాంతం

- సాయంత్రం 5 గంటలకు 63 శాతం పోలింగ్
- ఏపీ, బెంగాల్‌లో చెదురుమదురు ఘటనలు
- నాల్గవ విడతలో భారీగా ఓటేసిన ప్రజలు

8లో

సార్వత్రిక ఎన్నికల నాల్గవ విడత పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 63 శాతం పోలింగ్ నమోదయింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి.

డబ్బు చుట్టూ ఎన్నికలు

- సామాన్యుడు పోటీ చేసే ప్రసక్తే లేదు
- ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలం
- వీటిన్నింటిపై సుప్రీంలో కేసు వేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం : సామాన్యుడు అభ్యర్థిగా నిలబడే ప్రసక్తే లేదని, డబ్బు చుట్టూనే ఎన్నికలు నడుస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. గతంలో అభ్యర్థులు డబ్బు ఇస్తే కొంతమంది తీసుకునే వారని, మరికొంతమంది నిరాకరించేవారని ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్లే డబ్బులు ఇవ్వాలనే దుస్థితి వచ్చిందని తెలిపారు. సోమవారం స్థానిక మొరార్జీ నగర ప్రాథమిక పాఠశాల, ఉమానగర్ పోలింగ్ కేంద్రంలో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యర్థుల ఇంటి దగ్గరకు ఓటర్లు వచ్చి డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నారని, ఇవ్వకపోతే

- మిగతా 2 లో

ప్రభుత్వ సానుకూలత
ఉప్పెనలా ఓటెత్తింది

8లో

టీడీపీ గూండాల విచ్చలవిడి దాడులు: సజ్జల

ఓటమి భయంతోనే
వైసీపీ దాడులు

టీడీపీ అధినేత చంద్రబాబు

సీపీఐ ఎంపీ సెల్వరాజ్ కన్నుమూత

చెన్నై: సీపీఐ సీనియర్ నేత, నాగపట్నం ఎంపీ ఎం.సెల్వరాజ్ (67) కన్నుమూశారు. శ్వాసకోశ, మూత్ర పిండాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సెల్వరాజ్... చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. నాగపట్నం ప్రస్తుత ఎంపీగా ఉన్న 67 ఏళ్ల ఎం.సెల్వరాజ్‌కి గతంలో కిడ్నీ మార్పిడి జరిగింది. రైతు, సామాజిక కార్యకర్త అయిన సెల్వరాజ్ సీపీఐలో అత్యంత సీనియర్ నేత. నాగపట్నం నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తిరువారూర్ జిల్లా పరిధిలో ఉన్న నీడమంగళం టౌన్ పంచాయతీ కప్పలుదయాన్ గ్రామంలో 1957లో జన్మించిన సెల్వరాజ్...చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. సీపీఐ విద్యార్థి, యువజన విభాగాలైన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లో అనేక కీలక పదవులు నిర్వహించారు. నీడమంగళం నుండి పార్టీలో స్థానిక కమిటీ సభ్యునిగా పనిచేసిన సెల్వరాజ్... నాగపట్నం జిల్లా కార్యదర్శిగా, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎదిగారు. సెల్వరాజ్ తొలిసారిగా 1989లో నాగపట్నం నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి, 1996, 1998, 2019లోనూ మొత్తం నాలుగు పర్యాయాలు ఎంపీగా విజయం సాధించారు. సెల్వరాజ్‌కు భార్య కమలావతనం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని చెన్నై నుంచి నాగపట్నం తరలించారు. నాగపట్నం ఎంపీ ఎం.సెల్వరాజ్ మృతికి సీపీఐ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆయనను ఆదర్శప్రాయమైన నేతగా అభివర్ణించింది. తిరువారూర్ జిల్లాలోని సీతమల్లి గ్రామంలో ఆయన అంత్యక్రియలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏంటాలోచిస్తున్నారు? ఇప్పటినుంచీ ఫిరాయిద్దామనా? లేదా దగ్గరలో చేసి జంపయిపోదామనా!?

ఓటరుపై చేయిచేసుకున్న తెనాలి ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు జిల్లా తెనాలి లోని ఓ పోలింగ్ బూత్ లో జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్థానికంగా ఓటేసేందుకు వెళ్లిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ బూత్‌కు వచ్చిన ఓ ఓటరు పై చేయి చేసుకోవడం, అతను తిరిగి ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించడం కలకలం రేపింది. అసలేమైందంటే... గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్ పోలింగ్ బూత్ వద్ద అధికార

- మిగతా 2 లో

మహాలక్ష్మితో మహిళలకు మేలు

సోనియా గాంధీ

న్యూదిల్లీ: తమ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో జాబితా చేసిన 'హామీలు' ఈ 'క్లిష్ట సమయం'లో ప్రజల పరిస్థితులను మారుస్తాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సోమవారం హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమంలో ప్రసారం చేసిన ఒక వీడియో సందేశంలో 'తీవ్రమైన సంక్షోభం' నేపథ్యంలో దేశ మహిళలు కఠినమైన సమయాలు ఎదుర్కొంటున్నారు. పార్టీకి చెందిన 'మహాలక్ష్మి పథకం' వారి జీవితాలను మార్చడానికి సహాయపడుతుంది' అని అన్నారు. 'నా ప్రియమైన సోదరీమణులు, మహిళలు స్వేచ్ఛా పోరాటం నుంచి ఆధునిక భారతదేశం సృష్టి వరకు భారీ సహకారం అందించారు. అయితే, ఈ రోజు మన మహిళలు తీవ్రమైన ద్రవ్యోల్బణం మధ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వారి కృషి, తపస్సుకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ వచ్చింది విప్లవాత్మక హామీతో' అని సోనియా గాంధీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 'మహాలక్ష్మి పథకం' పేద కుటుంబానికి చెందిన ఒక మహిళకు ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇస్తుందని ఆమె చెప్పారు. ఈ పథకం అమలవుతున్న కర్నాటక, తెలంగాణలోని కోట్ల కుటుంబాల జీవితాలను కాంగ్రెస్‌కు చెందిన 'హామీలు' ఇప్పటికే మార్చాయని సోనియా గాంధీ అన్నారు. ఈ రెండు దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 'ఇది జాతీయ గ్రామీణ

- మిగతా 2 లో

హమాస్ ప్రతిఘటనతో కంగుతిన్న ఇజ్రాయిల్

టెల్అవివ్: రఫా నగరంపై దాడి చేయడం ద్వారా హమాస్‌ను అంతం చేయాలన్న భావిస్తున్న ఇజ్రాయిల్‌కు అనూహ్య పరిణామాలు ఎదురవుతున్నాయి. ఉత్తర, మధ్య గాజాలో మళ్లీ హమాస్ క్రియాశీలమైంది. భూతల దాడుల్లో భాగంగా ఈ ప్రాంతంలో హమాస్‌ను తుదముట్టించామని భావిస్తున్న ఇజ్రాయిల్‌కు ఈ పరిణామం కలవరపెడుతోంది. రెండ్రోజులుగా ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ రక్షణ దళాలను (ఐడీఎఫ్) హమాస్ మిలిటెంట్లు ప్రతిఘటించడం ప్రారంభించారు. దీంతో కేవలం రఫాకే పరిమితమైన ఇజ్రాయిల్ ఇప్పుడు మళ్లీ గాజా వ్యాప్తంగా గగనతల దాడులను ప్రారంభించింది. ఆదివారం గాజా సిటీ తూర్పు ప్రాంతంలోని జబాలియా శరణార్థి శిబిరం లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించింది. రఫాలోనూ హమాస్ మిలిటెంట్లు లక్ష్యంగా దాడులు చేసింది.

మధ్య రఫాలో హమాస్ కీలక నేతలు తలదాచుకున్నారని భావిస్తున్న ఇజ్రాయిల్, ఆ ప్రాంతం నుంచి తరలివెళ్లాల్సిందిగా అక్కడి పలస్తీనా పౌరులను కరపత్రాల ద్వారా పదే పదే హెచ్చరిస్తోంది. దాదాపు 3 లక్షల మంది ఇప్పటికే ఖాన్ యూనస్, అల్ మవాసీ ప్రాంతాలకు తరలి వెళ్లారు. అయితే ఆ ప్రాంతాల్లో ఇప్పటికే శరణార్థులు కిక్కిరిసి ఉన్నారని.. కొత్తగా వచ్చేవారికి చోటు దొరకని పరిస్థితి ఉందని ఐక్యరాజ్యసమితి సంస్థలు, ఇతర సహాయక సంస్థలు చెబుతున్నాయి.

ఈజిప్ట్ ఆగ్రహం

ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ దిశగా శాంతి ప్రయత్నాలు ఓవైపు జరుగుతుంటే రఫాపై దాడులు కొనసాగడాన్ని ఈజిప్ట్ తప్పుపట్టింది. ఈ కవ్వింపు చర్యలు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఇక నుంచి గాజాకు సాయం పంపబోమని కాల్పుల విరమణ చర్చల్లో కీలక భూమిక వహిస్తున్న ఈజిప్ట్ తెలిపింది. ఈజిప్టు, గాజా సరిహద్దుల్లోని కీలక రఫా క్రాసింగ్‌ను ఇటీవల ఐడీఎఫ్ ట్యాంకు దళాలు ఆక్రమించిన సంగతి విదితమే. కాల్పుల విరమణకు అనేక షరతులు పెడుతున్న ఇజ్రాయిల్.. అమెరికా సూచిస్తున్న యుద్ధానంతర ప్రణాళికలనూ తిరస్కరిస్తోంది. వెస్ట్‌బ్యాంకును పాలిస్తున్న పలస్తీనా అథారిటీకే గాజా పగ్గాలను అప్పగించాలన్నది అమెరికా ప్రతిపాదన. అరబ్, ఇతర ముస్లిం దేశాల సాయంతో గాజాను పునర్నిర్మించాలన్న ఆలోచనలో ఉంది. ఇజ్రాయిల్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికా సూచన ఆమోదిస్తే పాలస్తీనా స్వతంత్రదేశంగా ఆవిర్భవిస్తుందన్న భయం ఇజ్రాయిల్‌ను వెంటాడుతోంది.

బైడెన్‌పై వ్యతిరేకత

కొన్ని రకాల ఆయుధాలను ఇజ్రాయిల్‌కు పంపించకుండా నిలిపేయాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తీసుకొన్న నిర్ణయాన్ని స్వపక్ష రిపబ్లికన్లు, విపక్ష డెమొక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రిపబ్లికన్ సెనెటర్ లిండ్సె గ్రాహం స్పందిస్తూ అమెరికా-ఇజ్రాయిల్ సంబంధాల్లో బైడెన్ నిర్ణయం అత్యంత దారుణమైందిగా పేర్కొన్నారు. ఆయుధ సరఫరాను కొనసాగిస్తూ.. ఇజ్రాయిల్‌కు అండగా ఉండాలని పేర్కొన్నారు. అదే పార్టీకి చెందిన మరో సెనెటర్ రిక్‌స్కాట్ స్పందిస్తూ... ఈ నిర్ణయం ద్వారా బైడెన్ హమాస్ మద్దతు బృందంలో చేరిపోయారని వ్యాఖ్యానించారు.

ఇక డెమొక్రటిక్ పార్టీకి చెందిన 26 మంది ప్రతినిధులు జోబైడెన్‌కు ఓ లేఖ రాశారు. "ఆయుధ సరఫరా నిలిపి హమాస్, ఇరాన్ మద్దతున్న బృందాలకు బైడెన్ నిర్ణయం ఓ సందేశం పంపింది. దీనిపై మేం ఆందోళనగా ఉన్నాం" అని ఆ లేఖలో పేర్కొన్నారు. రఫాపై దాడిని వ్యతిరేకిస్తూ ఇజ్రాయిల్‌కు గత వారం 2000 పౌండ్ల బరువైన 1800, 500 పౌండ్ల బరువైన 1700 బాంబుల సరఫరాను అమెరికా నిలిపివేసిన సంగతి విదితమే.

రక్షణమంత్రిని తొలగించిన పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రక్షణమంత్రి సెర్గీ షోయిగును తొలగించి ఆ స్థానంలో ఆండ్రీ బెలౌసోవ్‌ను నియమించారు. షోయిగుకు రష్యన్ ఫెడరేషన్ భద్రతా మండలి కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. రష్యన్ ఫెడరేషన్ మిలిటరీ-ఇండస్ట్రియల్ కమిషన్‌లో పుతిన్‌కు ఆయన డిప్యూటీగా ఉండనున్నారు.

ఆండ్రీ బెలౌసోవ్‌ను రక్షణమంత్రిని చేయడమనేది భద్రతా కూటమి ఆర్థిక వ్యవస్థను దేశ ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయాల్సిన అవసరంతో ముడిపడి ఉందని క్రెమ్లిన్ ప్రతినిధి చెప్పారు. బెలూసోవ్ గతంలో రష్యా ఉప ప్రధానిగా, దేశాధినేత సలహాదారుడిగా, ప్రభుత్వ ఆర్థిక శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది సెప్టెంబరులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా రక్షణ మంత్రిగా ఒలెక్సీ రెజ్నికోవ్‌ను తొలగించి, రుస్టెమ్ ఉమెరోవ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. అలాగే ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ జనరల్ వాలెరి జలుజ్నీ స్థానంలో ఒలెక్సాండర్ సిర్‌స్కీని నియమించారు.

ఉక్రెయిన్ దాడిలో 13మంది మృతి

రష్యా సరిహద్దు నగరం బెల్గోరోడ్‌లో ఉక్రెయిన్ జరిపిన దాడిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ సైన్యాలు ప్రయోగించిన మోర్టార్‌షెల్స్ కారణంగా 10 అంతస్తుల ఒక అపార్ట్‌మెంట్‌ను పాక్షికంగా కూలిపోయింది. 20 మంది పౌరులు గాయపడ్డారు. భవన పైకప్పు కూలిపోయింది. వెంటనే అక్కడకు చేరుకున్న రష్యా అత్యవసర ప్రతిస్పందనా దళం సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షించింది. బెల్గోరోడ్ గగనతలంలో ఉక్రెయిన్ ప్రయోగించిన కొన్ని క్షిపణులను, 2 డ్రోన్లను తమ రక్షణ దళాలు కూల్చివేశాయని, రష్యా ప్రకటించింది. దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది.

పీఓకేలో కొనసాగుతున్న ఆందోళనలు

ఇస్లామాబాద్ : పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) హింస, ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఎలాంటి పన్నులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, గోధుమ పిండిని రాయితీ ధరకు అందించాలని స్థానిక జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) చేపట్టిన ఆందోళనలు నాలుగో రోజుకు చేరుకున్నాయి.

కోహలా-ముజఫరాబాద్ మార్గంలో చాలా చోట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. మంగ్లా డ్యామ్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును తమకు ఉచితంగా ఇవ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. సున్నిత ప్రదేశాలు, మార్కెట్లు, వాణిజ్య కేంద్రాల వద్ద భారీగా పోలీసులను మోహరించారు. విద్యా సంస్థలు మూసివేశారు. మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కాగా నిరసనకారులు, పీఓకేలోని ప్రభుత్వం మధ్య చర్చలు అసంపూర్తిగా ముగియడంతో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. హింసాత్మక ఘటనపై అంతకుముందు స్పందించిన షెహబాజ్ షరీఫ్, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడని నిరసనకారులను కోరారు. ఆందోళనకారుల చేతిలో శనివారం ఓ పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణల్లో దాదాపు 100కి పైగా ఆందోళనకారులు, పోలీసులు గాయపడ్డారు. జేఏఏసీకి చెందిన అనేకమంది నాయకులు అరెస్టయ్యారు. నిరాయుధులైన ప్రజలపై బలగాలు కాల్పులు జరుపుతున్నాయని ఉద్యమకారుడు అంజాద్ అయూబ్ మిర్జా పేర్కొన్నారు. కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. పీఓకేలో పరిస్థితి చేజారిపోయిందనీ పొరుగు దేశమైన భారత్ దీనిలో జోక్యం చేసుకోవాలని కోరారు. పీఓకేకు స్వాతంత్ర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఎంపీ సెల్వరాజ్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు పార్టీ తెలిపింది.

దళితులకు అండగా...

యాభై ఏళ్ల క్రితం నాగపట్నంలోని వెన్మనై గ్రామంలో స్థానిక భూస్వాములు 29 మంది మహిళలు ,పిల్లలతో సహా 44 మంది అమాయక వ్యవసాయ కూలీలను (ఎక్కువగా దళితులు) గుడిసెలో బంధించి సజీవదహనం చేసిన దారుణ ఘటన జరిగింది. అప్పట్లో దళితుల పట్ల అంటరానితనం, ఆలయ ప్రవేశంపై నిషేధం చాలా ప్రబలంగా ఉంది. బాధితులకు సీపీఐ, సీపీఎం అండగా నిలిచాయి. ఈ పోరాటంతో పాటు గ్రామాల్లో వ్యవసాయ కూలీల వేతనాల పెంపు, భూ పంపిణీకోసం పోరాడిన సీపీఐని ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువలేరు.

స్టాలిన్ సంతాపం

నాగపట్నం ఎంపీ సెల్వరాజ్ మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగత ఎంపీ డెల్టా ప్రాంత ప్రజల హక్కుల కోసం, రైతుల కోసం అనేక పోరాటాలు చేశారని, కొత్త రైల్వే ప్రాజెక్టుల డిమాండ్‌లో కూడా ఆయన కీలక పాత్ర పోషించారని స్టాలిన్ కొనియాడారు. తనలాగే డెల్టా ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఆయనపై ప్రత్యేక అభిమానం ఉందని పేర్కొన్నారు.

'ఇండియా' అధికారంలోకి రాగానే

జైలు నుంచి బయటికి వస్తా

దిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూదిల్లీ: ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే తాను తీహార్ జైలు నుంచి బయటికి వస్తానని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం చెప్పారు. దిల్లీ మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికలలో ప్రచారం చేయడానికి జూన్ 1 వరకు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఆయన జూన్ 2న లొంగిపోయి తిరిగి జైలుకు వెళ్లవలసి ఉంటుంది. జూన్ 1వ తేదీన ఏడు, చివరి దశ పోలింగ్ పూర్తవుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కిస్తారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్లను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడుతూ తీహార్ జైలులో తాను జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నప్పుడు తనను విచ్ఛిన్నం చేసే, అవమానించే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. 'తీహార్‌లో నా సెల్ లోపల రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. 13 మంది అధికారులు పర్యవేక్షించారు. సీసీటీవీ దృశ్యాలను పీఎంవోకు అందించారు. మోదీజీ నన్ను పర్యవేక్షిస్తున్నారు... మోదీకి నాపై పగ ఎందుకో తెలియడం లేదు' అని అన్నారు. 'ఆప్ నాయకులను ప్రజలు గౌరవిస్తారు. మా పని కారణంగా బీజేపీకి భయపడతారు' అని తెలిపారు. 'నేను జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలి. జూన్ 4న జైలులో ఎన్నికల ఫలితాలు చూస్తాను. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చినట్లయితే 5న నేను బయటకు వస్తాను' అని ఆయన పార్టీ కౌన్సిలర్లతో అన్నారు. ఆదివారం ఆయన పార్టీ ఎమ్మెల్యేలతోనూ భేటీ అయ్యారు. తనను అరెస్టు చేసిన తర్వాత బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ విచ్ఛిన్నం కాకుండా ఉన్నందుకు ఎమ్మెల్యేలను ఆయన ప్రశంసించారు. 'ఆప్ విచ్ఛిన్నం కావడానికి బదులుగా మరింత ఐక్యంగా మారింది' అని తెలిపారు.

డబ్బు చుట్టూ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులను తిడుతూ శాపనార్థాలు పెట్టడం చూస్తుంటే ప్రజాస్వామ్యం ఏ స్థాయికి దిగజారిందోనని అనిపిస్తోందన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టారని చెబుతున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అధ్వాన పరిపాలన చేశారని విమర్శించారు. ఈ కేంద్ర, రాష్ట్ర పాలనలు రివర్స్ గేర్‌లో నడుస్తుంటే, అదే రివర్స్‌లో ఓటర్లు కూడా తెగించి అభ్యర్థుల దగ్గర డబ్బులు తీసుకున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో డబ్బు ఇవ్వకపోతే అభ్యర్థులను ఓటర్లు కొట్టే పరిస్థితి వస్తుందన్నారు.

ఈ విషయంపై అన్ని పార్టీల నాయకులు ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రపంచంలో భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యమంటూ, విశ్వగురువు అంటూ మాటలు చెబుతున్నాడని, అయితే దేశంలో ప్రజాస్వామ్యం కనుమరుగై ధనస్వామ్యం నడుస్తోందన్నారు. సాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మతాలను రెచ్చగొడుతూ నీచస్థితికి దిగజారడం చూస్తున్నామని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతుంటే ఎన్నికల కమిషన్ ఏమి చేస్తుందని రామకృష్ణ ప్రశ్నించారు. బహిరంగంగా డబ్బులు పంపిణీ చేస్తుంటే ఎన్నికల కమిషన్ ఏమీ పట్టించుకోనట్లు వ్యవహరిస్తోందన్నారు. మాలాంటి వామపక్ష పార్టీలు బ్యానర్లు కట్టుకుంటే తీసేస్తున్నారని, ర్యాలీలు నిర్వహిస్తుంటే సమయం అయిపోయిందని బలవంతంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డబ్బుల పంపిణీలో ఎన్నికల కమిషన్ వాటా పొందుతుందా అన్న అనుమానం వస్తోందన్నారు. దీనికి ఎన్నికల కమిషన్, పోలీసులు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాలపై ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని, వీటన్నింటిపై సుప్రీం కోర్టులో కేసులు వేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా న్యాయం జరగదన్న ఉద్దేశంతోనే సుప్రీం కోర్టు ద్వారా న్యాయం పొందాలని భావిస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, సింగనమల నియోజకవర్గ కార్యదర్శి పి.నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌కు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)

సిఖ్స్‌ఫర్ జస్టిస్ నుంచి సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు నిధులు అందాయని ఆరోపిస్తూ... విచారణకు గవర్నర్ డిమాండ్ చేస్తున్నారు. మార్చి 21న మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఈడీ అరెస్ట్ చేసిన కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. అయితే, అది చట్టవిరుద్ధమని పేర్కొంటూ వేసిన వివిధ పిటిషన్లను దిల్లీ హైకోర్టు ఇప్పటికే తిరస్కరించింది.

'గవర్నర్‌కు మా సూచనలు అవసరం లేదు. అతనికి సలహా ఇవ్వడానికి మేము లేము. చట్టానికి లోబడి ఆయన చేయాల్సిందంతా చేస్తారు' అని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాగా, 2019లోనూ క్రిమినల్ కేసులో కేజ్రీవాల్ విచారణ ఎదుర్కొంటున్నప్పుడు కోర్టు ఇదే విధమైన పిటిషన్‌ను కొట్టివేసింది. 'ప్రాసిక్యూషన్ ఇంకా కొనసాగుతోంది. ఆయన నిర్దోషిగా బయటపడొచ్చు.. అప్పుడు మీరు ఏమి చేస్తారు? అతను దోషిగా తేలిన తర్వాత రండి' అని నాటి దిల్లీ ప్రధాన న్యాయమూర్తి రాజేంద్ర మీనన్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. కాగా, రెండు రోజుల క్రితం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు 21 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

రీపోలింగ్ అవసరం రాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా రీపోలింగ్ నిర్వహించే అవసరం రాదని ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సోమవారం సాయంత్రం చెప్పారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం, పల్నాడు, తెనాలి, అన్నమయ్య జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై సమాచారం ఉందని, వాటిపై తగిన చర్యలకు ఆదేశించామన్నారు. అయితే అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన వీటిపై ముందుగానే తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మాచర్ల కేంద్రంలో ఈవీఎంలు దెబ్బతిన్నాయి. వెంటనే ఇంజినీర్లు యంత్రాలను పరిశీలించి డేటా వస్తుందని చెప్పారు. ఇదే నియోజకవర్గంలో ఎనిమిది కేంద్రాల్లో యంత్రాలు మార్చి మళ్లీ పోలింగ్ నిర్వహించాం. అందువల్ల ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదని సీఈవో స్పష్టం చేశారు. ఓటరు జాబితా విషయంలో ఈ సారి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. 'ఈవీఎంలకు సంబంధించి అక్కడక్కడా కొన్ని సమస్యలు వచ్చాయి.

275 బీయూలు, 217 సీయూలు, 600 వీవీప్యాట్‌లకు సంబంధించి సమస్యలు తలెత్తాయి. పోలింగ్ కేంద్రాల వద్ద 20వేల యంత్రాలు అదనంగా ఉంచాం. పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగే అవకాశముందని ఇంటెలిజెన్స్ నుంచి ముందే సమాచారం అందింది. అందుకు ప్రత్యామ్నాయంగా వెంటనే చర్యలు చేపట్టాం. పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నాం. హింస చెలరేగిన ప్రాంతాలకు అదనపు భద్రతా దళాలను తరలించాం. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేపట్టామని మీనా వివరించారు. ఈసారి పోలింగ్ శాతం బాగా పెరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు 68 శాతం పోలింగ్ జరిగింది. రాత్రి 10 గంటలకు పోలింగ్ పూర్తయ్యే అవకాశముందని, తుది పోలింగ్ వివరాలు పరిశీలించిన తర్వాత వెల్లడిస్తామని మీనా చెప్పారు.

పోటెత్తిన ఓటరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఓటర్లు పోటెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచే జనం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ ప్రజలు లెక్కచేయలేదు. అలాగే అనేకచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ జనం బెదరలేదు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండటం విశేషం. ఎట్టిపరిస్థితుల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్న ఆరాటంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. దీంతో వీరందరికీ ఓటు వేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 68 శాతం పోలింగ్ నమోదు కాగా, సమయం ముగిశాక కూడా దాదాపు 3,500కు పైగా కేంద్రాల వద్ద పోలింగ్ కొనసాగుతోంది. రాత్రి 10 గంటల వరకు ఈ పోలింగ్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ అరకు, పాడేరు, రంపచోడవరంలో మాత్రం గడువు ప్రకారం సాయంత్రం 4 గంటలకే ముగియగా, కురుపాం, పాలకొండ, సాలూరులో సాయంత్రం 5 గంటలకే పరిసమాప్తమైంది. మిగతా చోట్ల సాయంత్రం 6 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా దాదాపు ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో రాత్రి పొద్దు పోయే వరకు క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉన్నారు. ఓటుహక్కు వినియోగించుకొనేందుకు జనం పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉండటంతో అందరికీ స్లిప్పులు ఇచ్చిన ఎన్నికల సంఘం అధికారులు... వారందరికీ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించడంతో పోలింగ్ శాతం భారీగా నమోదయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెపుతున్నారు. ఇక అనేకచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. గంటల తరబడి పోలింగ్ ఆలస్యమైంది. అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మాచర్లను అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా పరిగణించి భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినప్పటికీ పెద్దఎత్తున హింస చెలరేగింది. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పెద్దఎత్తున అల్లర్లు చోటుచేసుకున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను అధికార పార్టీకి చెందిన శ్రేణులు పగులగొట్టారు. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు దొండపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్లిన సందర్భంగా ప్రత్యర్థులు ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఆయన వెంట వచ్చిన మూడు కార్లను ధ్వంసం చేశారు. రెంటాల గ్రామంలో టీడీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపడంతో అక్కడకు టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి చేరుకున్నారు. దీంతో ఆయనను వైసీపీ నేతలు అడ్డుకుని, ఆయన కారుతో పాటు, వెంట వచ్చిన నాలుగు కార్లను ధ్వంసం చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని దలవాయిలో ఈవీఎంను ధ్వంసం చేశారు. తుమ్మకోటలో టీడీపీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయన్న ప్రచారంతో వైసీపీ శ్రేణులు పోలింగ్‌బూత్‌లోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేశారు. కొత్తపల్లి సర్పంచ్‌పై దాడి చేశారు. సత్తెనపల్లి, అచ్చంపేటలో టీడీపీ, వైసీపీ శ్రేణులు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. బాపట్ల మండలం పన్నిబోయినవారిపాలెంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ఇరువర్గాలకు చెందిన ఏజెంట్ల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో వీవీ ప్యాట్స్ ధ్వంసమై పోలింగ్ కొద్దిసేపు ఆగింది. నెల్లూరు జిల్లా వరికుంటపాడు జెడ్పీ స్కూలులో, చిత్తూరు జిల్లా నగరి సీతారామపురంలో, అల్లూరి జిల్లా రెంతాడ తదితర అనేక ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్ని వాహనాలపై కంభంపాడులో వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. దాచేపల్లి మండలం తంగెడలో వైసీపీ శ్రేణులు నాటు బాంబులు, పెట్రోల్ సీసాలతో దాడులకు తెగబడ్డారు. పోలింగ్ ముగిసే సమయంలో ఓటు విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఓటింగ్ శాతం పెరిగితే తమకు నష్టం జరగుతుందేమోనన్న భయంతో వైసీపీ శ్రేణులు నాటుబాంబులతో దాడులకు దిగాయి. మరోవైపు రాళ్ల వర్షం కురిపించడంతో ఓటర్లు భయాందోళనకు గురై పోలింగ్ కేంద్రం నుంచి పరుగులు తీశారు. ఈ ఘర్షణలో సుమారు పది ద్విచక్రవాహనాలు, నాలుగు దుకాణాలు మంటల్లో దగ్ధమయ్యాయి. నరసరావుపేట పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద అధికారపార్టీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద్ బాబు కారుపై దాడి చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. అనంతరం టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ఆందోళన చేపట్టాయి. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడికి చేరుకున్న పోలీసులు రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయువు ప్రయోగించి రెండు వర్గాలను చెదరగొట్టారు. నకరికల్లు మండలం చీమలమర్రిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా 20 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాడి ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన ఓటర్లు పోలింగ్ కేంద్రంలో తలదాచుకున్నారు. దాచేపల్లి మండలం ఇరికేపల్లి, నడికుడిలోనూ ఘర్షణలు జరిగాయి. తెనాలిలో వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ప్రశ్నించిన ఓటరుపై చేయిచేసుకోగా, తిరిగి ఆ ఓటరు కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించాడు. దీంతో హతాశులైన ఆయన వెంట ఉన్న అనుచరులు ఆ ఓటరుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతపురం జిల్లాలోనూ వివిధ నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. పెద్దఎత్తున హింసాత్మక ఘటనలు జరిగినా...కొన్ని ప్రాంతాల్లో జోరువాన కురిసినా, మరికొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటింగ్ శాతం మాత్రం పెరిగే అవకాశాలుండడం అధికార, ప్రతిపక్ష పార్టీలు తమకు అనుకూలంగా భావిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో ఎక్కువగా ఉండడం వల్లే ఓటర్ల నుంచి పెద్దఎత్తున స్పందన కనపడుతోందని టీడీపీ చెపుతుండగా, ఇవన్నీ ప్రభుత్వానికి సానుకూల పవనాలేనని వైసీపీ నేతలు చెపుతున్నారు.



మహాలక్ష్మితో మహిళలకు మేలు

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి హామీ పథకం అయినా, సమాచార హక్కు, విద్యా హక్కు లేదా ఆహార భద్రత వంటి పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ లక్షలాది మంది భారతీయులకు సాధికారత ఇచ్చింది. మా పనిని ముందుకు తీసుకెళ్లడానికి 'మహాలక్ష్మి' తాజా హామీ' అని కాంగ్రెస్ నేత అన్నారు. 'ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్ హస్తం మీతో ఉందని నేను మీకు భరోసా ఇవ్వాలనుకుంటున్నాను.

ఈ హస్తం మీ పరిస్థితులను మారుస్తుంది. ధన్యవాదాలు. జై హింద్' అని ఆమె పార్టీ చిహ్నాన్ని ప్రస్తావిస్తూ అన్నారు. కాగా, ఆమె విజ్ఞప్తిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా 'ఎక్స్' పోస్టుల్లో పంచుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ... 'మీ ఒక ఓటు మీ ఖాతాలో ఏటా లక్ష రూపాయలకు సమానమని పేద కుటుంబాల మహిళలు గుర్తుంచుకోవాలి' అని అన్నారు. భయంకరమైన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మధ్య పోరాడుతున్న మహిళలకు కాంగ్రెస్ 'మహాలక్ష్మి' పథకం రక్షణగా ఉంటుంది. ప్రతి నెలా రూ.8,500 నేరుగా బ్యాంక్ ఖాతాలలో జమ చేయడంతో భారతదేశ మహిళలు ఆర్థికంగా ఒకరిపై ఆధారపడటం నుంచి విముక్తి పొందుతారు' అని పేర్కొన్నారు. 'అందువల్ల ఓటు వేయండి. మీ పరిస్థితులను మార్చండి' అని పిలుపునిచ్చారు.

ఓటరుపై చేయిచేసుకున్న తెనాలి ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రెచ్చిపోయారు. ఓటు వేయటానికి వచ్చిన ఎమ్మెల్యే క్యూ పద్ధతి పాటించకుండా నేరుగా లోపలికి వెళ్లబోయారు. క్యూలైన్ లో రావాలంటూ అభ్యంతరం చెప్పిన ఓటరుపై ఎమ్మెల్యే రెచ్చిపోయారు. ఏ మాత్రం ఆలోచించకుండా అహంకారంతో అతడి దగ్గరకు వెళ్లి చెంపదెబ్బ కొట్టారు. వెంటనే ఓటరు కూడా ఎమ్మెల్యే శివకుమార్ చెంప చెళ్లుమనిపించారు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు విచక్షణారహితంగా దాడి చేయడంతో సదరు ఓటరు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా ఎమ్మెల్యే శివకుమార్ దాడిలో గాయపడిన గొట్టిముక్కల సుధాకర్ ను పోలీసులు టూ టౌన్ పోలీసు స్టేషన్ కు తరలించారు. గాయపడిన సుధాకర్ ను వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించకుండా పోలీసు స్టేషన్ కు తరలించడంపై స్థానికులు మండిపడ్డారు.

మొదట దాడి చేయడమే కాకుండా నలుగురైదుగురు కలిసి ఏ తప్పు చేయని సుధాకర్ ను కొడితే ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోకుండా బాధితుడిని అదుపులోకి తీసుకోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత నుంచి దాదాపు మూడు నాలుగు గంటలు ఎవరని కలవనీయకుండా స్టేషన్ లోనే ఉంచడం పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఎమ్మెల్యే శివకుమార్ పై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఓటింగ్ అయ్యే వరకు గృహ నిర్బంధం చేయాలని ఆదేశించింది. కాగా ఓటరును కొట్టేందుకు దారి తీసిన కారణాలను వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ వెల్లడించారు. తెనాలి ఐతానగర్‌లో భార్యతో కలిసి ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళ్లగా... గొట్టిముక్కల సుధాకర్ అనే వ్యక్తి మద్యం మత్తులో తనను కులం పేరుతో దుర్భాషలాడాడని తెలిపారు. తన భార్య ముందే అసభ్యంగా దూషించాడన్నారు. సుధాకర్ ఈ ఘటనపై స్పందిస్తూ... తెనాలి ఎమ్మెల్యే శివకుమార్‌ను కొట్టాలనే ఉద్దేశం తనకు లేదని... అదంతా అనుకోకుండా జరిగిందన్నారు. క్యూలైన్‌లో వెళ్లి ఓటెయ్యాలని మాత్రమే తాను ఎమ్మెల్యేకు సూచించగా... తనను ఆయన బూతులు తిట్టి కొట్టారని చెప్పారు.

ఈ ఘటన తర్వాత నాకు, నా కుటుంబానికి హాని కలిగే అవకాశం ఉందన్న సుధాకర్... పోలీసులే తమను రక్షించాలని కోరారు.

పల్నాడు రక్తసిక్తం

- వైసీపీ, టీడీపీ మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు... దాడులు
- తుమ్మకోటలో ఈవీఎంలను పగులగొట్టిన అధికారపక్ష నేతలు
- గాల్లో పోలీసుల కాల్పులు

విశాలాంధ్ర బ్యూరో-పల్నాడుజిల్లా: సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ నేతలు, కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలతో పల్నాడు జిల్లా రక్తసిక్తమైంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్న అధికార పార్టీ నేతలు ఈ ఎన్నికల్లో పోలింగ్ బూతుల్లో ఏజెంట్లను లేకుండా చేసేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణలు, దాడులు జరిగాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల టీడీపీ ఏజెంట్లు, నాయకులపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. నరసరావుపేట మండలం దొండపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్లను పోలింగ్ బూతుల నుంచి బయటకు లాగి పడేయడంతో గొడవలు జరిగాయి. అక్కడ పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును సైతం వైసీపీ శ్రేణులు అడ్డుకుని ఆయనతో వచ్చిన మూడు కార్లను ధ్వంసం చేశారు. అందుకు ప్రతిగా టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి చేసి ఇంటి బయట నిలిపిన మూడు కార్లను ధ్వంసం చేసి డాక్టర్ గోపిరెడ్డి మామ కంచుల రామకోటిరెడ్డి, డ్రైవర్ హరిపై దాడులు చేసి గాయపరిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టీడీపీ శ్రేణులను తరిమికొట్టి గాలిలో కాల్పులు జరిపారు. రొంపిచర్ల మండలం అన్నారంలో టీడీపీ, వైసీపీ వర్గాలు కర్రలతో దాడులు చేసుకున్నారు.

మాచర్లలో...

మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఆదివారం రాత్రి నుంచి దాడులు ప్రారంభమయ్యాయి. రెంటచింతలలో టీడీపీ ఏజెంట్లుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని వైసీపీ నాయకులు బెదిరించారనే నెపంతో టీడీపీ శ్రేణులు వైసీపీ నాయకులపై దాడి చేసి నలుగురిని తీవ్రంగా గాయపరిచారు. కాగా, సోమవారం ఉదయం ఎన్నిక ప్రారంభమైన గంటలోనే రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో టీడీపీ ఏజెంట్లను వైసీపీ నాయకులు పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపివేశారు. ఆ గ్రామంలో పరిస్థితిని సమీక్షించేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని సైతం వైసీపీ నేతలు అడ్డుకుని ఆయనతో పాటు వచ్చిన నాలుగు కార్లను ధ్వంసం చేశారు. తుమ్మకోటలో టీడీపీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయని తెలుసుకున్న వైసీపీ నాయకులు పోలింగ్ బూత్‌లోని ఈవీఎంలను పగులగొట్టారు. గ్రామంలో మైనారిటీ వర్గాలకు చెందిన ఇళ్లను తగులబెట్టారు. కల్లకుంటలో సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి కరెంట్ నిలిపివేశారు. కొత్తూరు, పాలవాయి గేటు, తుమ్మకోట, రెంటాల, కొత్తపల్లె రెడ్డిగూడెం గ్రామాల పరిధిలో పోలింగ్ నిలిపివేశారు. కొత్తపల్లి సర్పంచ్‌పై దాడి చేశారు. ఇండియా కూటమి అభ్యర్థి (కాంగెస్) డాక్టర్ రామచంద్రరెడ్డిపై కొత్తపుల్లారెడ్డిగూడెంలో వైసీపీ శ్రేణులు దాడులు చేశారు. పోలేపల్లిలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య దాడులు జరిగాయి. మాచర్ల పట్టణంలో టీడీపీ నాయకుడు కేశవరెడ్డి ఇంటిపై దాడి చేసి పది మంది కార్యకర్తలను గాయపరిచారు. వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ళలో జనసేన నేత మాదాసు నాగరాజుకు చెందిన బొలెరో మ్యాక్స్ వాహనాన్ని వైసీపీ నాయకులు తగులబెట్టారు.

గురజాలలో...

దాచేపల్లి మండలం కేశనపల్లి గ్రామంలో ఓటర్లను పోలింగ్ బూత్‌కు తరలించే విషయంలో వైసీపీ, టీడీపీ వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. టీడీపీ నేత రామకోటయ్యతో పాటు పలువురికి గాయాలు అయ్యాయి.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి నియోజకవర్గం ఫణిదంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. అచ్చంపేటలో టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. పలువురికి గాయాలయ్యాయి. ముప్పాళ్ల మండలం నార్నపాడులో మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉపేశ్ చౌదరి కారుపై వైసీపీ శ్రేణులు దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. తొండపిలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతో పలువురు గాయపడ్డారు. సత్తెనపల్లి పట్టణంలోని 23వ వార్డులో వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. జనసేన నేత శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం దొడ్లేరులో వైసీపీ, టీడీపీ నాయకులు పరస్పర దాడులకు తెగబడ్డారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని నరసరావుపేట, మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో రక్తమోడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులను పోలీసులు మధ్యాహ్నం నుంచి హౌస్ అరెస్టులో ఉంచారు. సమస్యాత్మక నియోజకవర్గాల్లో పెద్దఎత్తున కేంద్ర పోలీసు బలగాలను మోహరిస్తున్నామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించిన పోలీసు యంత్రాంగం ఎన్నికల వేళ పూర్తిగా విఫలమైందని ఓటర్లు, రాజకీయ పార్టీ నాయకులు అంటున్నారు.

పోలింగ్ శాతం పెరగడం హర్షణీయం

'ఇండియా' విజయానికి అనుకూల పవనాలు: ఓబులేసు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 73 శాతం ఓటింగ్ జరగడం ఎంతో హర్షించదగిన విషయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు అన్నారు. పట్టణంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా మొత్తం చూస్తే మైదుకూరు, జమ్మలమడుగులో 78 శాతం పైబడి ఓటింగ్ జరిగిందన్నారు. కమలాపురం నియోజకవర్గంలో 73 శాతం పోలింగ్ సరళితో ఉదయం 6.30 నుంచి ఏడు గంటల మధ్య నుంచే పెద్ద ఎత్తున మహిళలు, పురుషులు బారులు తీరి ఓట్లు వేయడం చూస్తుంటే ఇండియా కూటమికి ఎక్కువ శాతం అనుకూల పవనాలు వీస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్కడక్కడ ఏర్పాట్ల లోపం చెదురుముదురు సంఘటనలు మినహా ఓటర్లందరు ఓపికతో రాష్ట్ర, దేశ ప్రగతి కోసం తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందదాయకమన్నారు. జిల్లాలో జరిగిన ఓటింగ్ సరళిని బట్టి వైసీపీ ప్రభుత్వానికి ఎన్డీయే కూటమికి భారీగా దెబ్బతగిలే విధంగా ఉన్నాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ముస్లిం మైనార్టీలు అధికశాతం కడప, కమలాపురం, ప్రొద్దుటూరులో ఉన్నారని వారిలో ముఖ్యంగా ముస్లిం మైనార్టీ మహిళలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం మరింత అభినందించదగ్గ విషయమన్నారు. ఓటింగ్ శాతాన్ని బట్టి కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలరెడ్డికి అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. అదేవిధంగా కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన 73 శాతం ఓటింగ్ సరళిని బట్టి చూస్తే సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర (కంకికొడవలి గుర్తు) గెలుపునకు అనుకూలత ఎక్కువగా ఉందని అభినందించారు. ఎట్టకేలకు జిల్లా వ్యాప్తంగా జరిగిన ఓటింగ్ సరళిలో పాల్గొన్న ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యం హైజాక్‌కు వైసీపీ యత్నం

ఓఎస్డీ ధనుంజయరెడ్డి వ్యవహారాలపై స్పందించండి

సీఈఓకు ఎన్డీఏ కూటమి నేతల వినతి

విశాలాంధ్ర-విజయవాడ: దాడులు, బెదిరింపులతో ప్రజా స్వామ్యాన్ని హైజాక్ చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తుందని ఎన్డీఏ కూటమి నేతలు అన్నారు. ముఖ్యమంత్రి పేషీలో ఓఎస్డీగా ఉన్న ధనుంజయ్ రెడ్డి వైసీపీ నేతలకు మేలు జరిగేలా వ్యవహరించాలంటూ కలెక్టర్లకు సూచనలిస్తున్నారని, ఈ అంశంపై స్పందించాలంటూ సోమవారం సీఈఓ ముకేశ్ కుమార్ మీనాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... వైసీపీకి గుడ్ బై చెప్పి ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించదానికి ప్రజలు సిద్ధమైపోయారని చెప్పారు. శాసన మండలి మాజీ చైర్మన్ ఎం.ఎ.షరీఫ్ మాట్లాడుతూ... పోలింగ్ ప్రక్రియ ఎంతో ఉత్సాహంగా జరిగిందని, ప్రజలు ఎలాంటి మార్పు కోరుకుంటున్నారో వారి ఉత్సాహం చూసి అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజల్లో వచ్చిన మార్పు తిరుగుబాటుకు నిదర్శనంగా కనిపిస్తోందన్నారు. ఓటమి భయంతోనే దాడులతో అక్రమాలకు పాల్పడాలని వైసీపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నారన్నారు. మాచర్లలో వైసీపీ నేతలు తొలి నుంచి ఫ్యాక్షన్ రాజకీయాన్ని ప్రేరేపిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని ప్రయత్నిస్తున్న బ్రహ్మారెడ్డిపై దాడులకు తెగబడి అతడి కారును ధ్వంసం చేశారని చెప్పారు. రిగ్గింగ్‌కు వీల్లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోలింగ్ నిర్వహిస్తున్న ఏజెంట్లపై దాడులు చేసి బయటకు తరిమేస్తున్నారని తెలిపారు. ఓటర్లను బూత్ వద్దకు రాకుండా బెదిరింపులకు దిగుతున్నారని చెప్పారు. నరసరావుపేటలో లావు శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు కార్లపై దాడులకు పాల్పడ్డారన్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అతడి కుమారుడు ప్రత్యక్షంగా దాడులకు తెగబడ్డారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి మహిళలను కారుతో తొక్కించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. చీరాలలో కొండయ్యపై దాడికి పాల్పడ్డారన్నారు. శ్రీకాకుళంలో గొండు శంకర్‌పై పోలింగ్ బూతులోనే దాడి చేశారని చెప్పారు. తిరువూరులో కేశినేని చిన్ని కారును ధ్వంసం చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను సైతం హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ మాట్లాడుతూ... వైసీపీ నైరాశ్యంతో ఓటర్లను చెల్లాచెదురు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ధర్మవరంలో సత్యకుమార్ యాదవ్‌ను ఓడించే లక్ష్యంతో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, విజయవాడ పశ్చిమలో వైసీపీ అభ్యర్థి ఏకంగా పోలీసులపై వీరంగం సృష్టించారని చెప్పారు. గుంటూరులో బీజేపీ నేత సునీల్‌పై ఎమ్మెల్సీ అప్పిరెడ్డి దాడికి పాల్పడ్డారన్నారు. రాజమండ్రిలో పోలింగ్ బూత్‌ల వద్ద బ్లేడ్ బ్యాచ్‌ను రంగంలోకి దింపాడన్నారు. తాడిపత్రిలో ఎస్పీ వాహనంపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెగబడ్డాడని, తెనాలిలో ఓటరుపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దాడికి పాల్పడ్డాడని ధ్వజమెత్తారు. జనసేన అధికార ప్రతినిధి ప్రొఫెసర్ కె.కె.శరత్ మాట్లాడుతూ... ఓటు హక్కును హరించేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తు న్నారన్నారు. ఓటమి ఫిక్స్ అయిపోయిందనే అసహనంతో దుర్మార్గాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఓటరుపై తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దాడి చేయడం హేయం అన్నారు. జగన్ అరాచకాల పై ప్రజలు ఎంతలా విసిగిపోయారో పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ప్రజలే నిదర్శనం అన్నారు.

ఓటేసిన ప్రముఖులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ 155వ పోలింగ్ బూత్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఓటు వేశారు. పులివెందుల బాకాపురంలోని 138 పోలింగ్ బూత్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు, భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి ఓటేశారు. పులివెందుల నియోజకవర్గం ఇడుపులపాయ పోలింగ్‌బూత్ 261లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఆమె భర్త బ్రదర్ అనిల్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హిందూపురంలో టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ ఓటేశారు. మంగళగిరిలో పవన్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజమండ్రిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఓటేశారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, సీఈవో ముకేశ్‌కుమార్ మీనా ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు ఓటు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఓట్లు వేశారు. అనంతరం నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లను అభ్యర్థులు సందర్శించారు.

మంగళగిరి నియోజకవర్గంలో ఓటు హక్కులేని తన భార్యను పోలింగ్ బూత్‌లోకి పవన్ కల్యాణ్ తీసుకెళ్లడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ కల్యాణ్... అక్కడి నియోజకవర్గంలో ఓటు నమోదు చేసుకోలేదు. మంగళగిరి నియోజకవర్గంలో పవన్ ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మంగళగిరిలో ఆయన ఓటేసి పిఠాపురం వెళ్లారు. జనసేన గుర్తుపై పిఠాపురంలో ఓటేసే అవకాశాన్ని కోల్పోయారు.

గ్లాసును వదిలి... సైకిల్ గుర్తుకు!

జనసేన అధినేత ఓటు వైరల్

విశాలాంధ్ర-అమరావతి: ఓ పార్టీకి అధ్యక్షుడిగా ఉండి కూడా తన పార్టీ గుర్తుకు తానే ఓటేసుకోలేని విచిత్రమైన సంఘటన ఆంధ్రలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు నువ్వా-నేనా అన్న రీతిన సోమవారం జరిగాయి. ఎన్డీయే కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) అభ్యర్థులు ఓ వైపు, వైసీపీ మరో వైపు 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. కడప జిల్లా పులివెందులలో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జగన్ తన పార్టీ గుర్తైన ఫ్యాన్‌కు ఓటేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు గుంటూరు జిల్లా ఉండవల్లిలో తన పార్టీ సైకిల్ గుర్తుకు ఓటువేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే అక్కడ తనకు ఓటు లేకపోవడంతో తన పార్టీ గుర్తు గాజు గ్లాస్‌కు ఓటు వేయలేకపోయారు. ఉండవల్లిలో ఓటు నమోదు చేసుకోవడంతో ఆయన సైకిల్ గుర్తుపైనే ఇక్కడ ఓటేయాల్సి వచ్చింది. ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉండి ఎన్నికల కమిషన్ తనకు కేటాయించిన గాజుగ్లాస్ గుర్తుపై ఓటు వేసుకోలేకపోయిన విచిత్ర పరిస్థితిని ఎదుర్కొన్నారు. 'ఓ పార్టీ అధ్యక్షుడు తన గుర్తుపై తానే ఓటు వేసుకోలేదు... ఇది విచిత్రమైన సంఘటన కదూ' అన్న క్యాప్షన్ వైరల్ అవుతోంది. ఇది చూసిన కొందరు ముక్కున వేలేసుకుంటున్నారు.

బస్, రైల్వే స్టేషన్లు కిటకిట

> విజయవాడ-హైదరాబాద్ రహదారిపై రద్దీ
>
> ఓటేసిన ప్రజలు తిరుగు ప్రయాణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటర్లు తిరుగు పయన మయ్యారు. విజయవాడ-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. చిలకల్లు టోల్ ప్లాజా వద్ద బారులుతీరి నిలిచిపోతున్నాయి. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రజలు విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి బస్సుల ద్వారా హైదరాబాద్‌కు వెళ్లారు. మరికొందరు రైల్వేస్టేషన్‌కు వెళ్లి హైదరాబాద్‌కు వెళు న్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ ఉదయం వరకు వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లు, ప్రత్యేక వాహనాల ద్వారా ఆంధ్రాకు ఓటర్లు తరలివచ్చారు. ఎన్ఆర్ఐలు ప్రత్యేక విమానాల్లో వచ్చారు. వాళ్లంతా తమ గ్రామాలు, పట్టణాలకు వెళ్లి ఓట్లు వేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల కొద్దీ క్యూలైన్లలో నిలుచున్నారు. కొందరు రెండు రోజులపాటు గ్రామాల్లోనే మకాం వేయగా, ఉద్యోగాల రీత్యా మరికొందరు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాలకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నడిచే 339 సర్వీసులతోపాటు అదనంగా మరో 206 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, ఏలూరు, ఒంగోలు, మచిలీపట్నం, గుంటూరు, నరసరావుపేట, నంద్యాల, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు బస్సులను సాధారణ చార్జీలతోనే నడిపింది. దక్షిణ మధ్య రైల్వే అధ్వర్యంలో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక రైళ్లను నడిపింది. ఓట్లు వేసి తిరుగు ప్రయాణం చేసే వారికి ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచింది. విదేశాల నుంచి వచ్చిన ఎన్ఆర్ఐలు తిరిగి వెళ్లిపోతున్నారు. తిరుపతి, గన్నవరం, విశాఖపట్నం ద్వారా వారు విదేశాలకు వెళ్తున్నారు.

పోలింగ్ జాతర

- ఎక్కడ చూసినా వృద్ధులు, మహిళలే
- యువ ఓటర్ల ఆసక్తి
- ప్రతి రెండు గంటలకు పెరిగిన శాతం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పోలింగ్ కేంద్రం దగ్గర చూసినా వృద్ధులు, మహిళలే ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోను మహిళా ఓటర్ల సందడి నెలకొంది. దీంతో వారి ఓట్లు అత్యధికంగా ఎవరికి వెళతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మండుటెండలను సైతం లెక్క చేయకుండా గ్రామీణ ఓటర్లు బారులుదీరారు. కొత్తగా ఓటు కలిగిన యువత ఆసక్తిగా ఓటును వినియోగించుకున్నారు. చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు అసంతృప్తికి గురైనప్పటికీ ఓపిగ్గానే క్యూ లైన్లలో నిలుచున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని కౌతా సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్‌లో ఈవీఎంలు మొరాయించాయి. మచిలీపట్నం లోను అదే పరిస్థితి ఎదురైంది. ఈవీఎంల పరిస్థితిని ప్రతిపక్ష ఐదు నిముషాలకోసారి ఎన్నికల సిబ్బందిని అడిగి, సమాచారం తెలుసుకున్నారు. దీంతో అక్కడక్కడా ఉదయం 7 గంటలకు జరగాల్సిన పోలింగ్ అర్థ గంట, గంట ఆలస్యంతో ప్రారంభమైంది. ప్రతి రెండు గంటలకూ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ శాతం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలకు కలిపి 9 గంటల సమయానికి పోలింగ్ శాతం 9.5 శాతం నమోదయింది. ఉదయం 11 గంటలకు 23.10 శాతం నమోదయింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు కనీసం గంటకు పైగా సమయం పట్టింది. మరికొన్ని చోట్ల అర్థగంటలోపే ఓటు వేసే అవకాశం కలిగింది. వృద్ధులు, వికలాంగులు వీల్‌చైర్లలో పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నానికి 40.26 శాతం వరకు ఓటింగ్ నమోదయింది. ఇందులో మహిళలు 36.84 శాతం, పురుషులు 35.03 శాతం చొప్పున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నాటికి కోటిన్నర మంది ఓట్లు వేశారు. ఈ సారి అర్బన్ ఓటర్లలో యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ బూత్‌ల వద్ద కిక్కిరిసిన వాతావరణ ఏర్పడింది. గత ఎన్నికలతో పోలిస్తే భిన్నమైన వాతావరణ నెలకొంది. సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 55.49 శాతం ఓటింగ్ నమోదయింది. అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. అక్కడి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లలో ఉన్న వారికి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఇచ్చారు. మిగిలిన నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగుస్తుందన్న సమాచారంతో పెద్దఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. 6 గంటల్లోగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి క్యూలైన్లలో నిలుచున్న వారందరికీ ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. విజయవాడ, గుంటూరు, విశాఖ, తిరుపతి ప్రధాన నగరాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున యువకులు క్యూలైన్లలో నిలుచున్నారు. చోడవరం, గోపాలపురం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుదీరి నిల్చొని ఉన్నందున రాత్రి వరకు అక్కడ పోలింగ్ కొనసాగించారు. ఇక్కడ దాదాపు మరో రెండు గంటల పాటు ఓటింగ్ కొనసాగే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటల వరకు 67.99 శాతం ఓటింగ్ శాతం నమోదయింది.





తాడిపత్రిలో ఉద్రిక్తత

రాళ్లు రువ్వుకున్న కేతిరెడ్డి, అస్మిత్‌రెడ్డి వర్గీయులు

విశాలాంధ్ర-తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్ సందర్భంగా సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణంలోని ఓం శాంతి నగర్ 9వ వార్డులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి వర్గీయులు పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారు. జేసీ అస్మిత్‌రెడ్డి పోలింగ్ బూత్ వద్దకు వచ్చి వెళుతుండగా ఓంశాంతి నగర్ వద్ద ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎదురుపడి ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకొని రాళ్ల దాడికి దిగారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. అలాగే రెండు పార్టీల అనుచరులకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్పీ అమిత్ బర్దర్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఘర్షణను అణచివేసి చెదరగొట్టి పోలింగ్ కేంద్రంలో ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ప్రశాంత వాతావరణం నెలకొల్పారు. ఈ దాడిలో ఎమ్మెల్యేకు చెందిన మూడు వాహనాలు, తెలుగుదేశం అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి వర్గానికి చెందిన రెండు వాహనాలు ధ్వంసమైనట్లు సమాచారం. మండలంలోని బోడాయపల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్త కృష్ణమూర్తిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనలో కృష్ణమూర్తి తలకు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో కొన్ని చోట్ల ఘర్షణ వాతావరణం తప్ప మిగతా బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

సంపాదకీయం

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నాల్గవ విడత పోలింగ్ 96 నియోజకవర్గాలలో సోమవారం సాయంత్రం ముగిసింది. బెంగాల్‌లో కొంతమేర గొడవలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టే. సోమవారం పోలింగ్ జరిగిన 96 స్థానాలు తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం వున్నాయి. ఈ విడతతో దక్షిణాదిలో పోలింగ్ సంపూర్ణమైంది. సాయంత్రం అయిదు గంటలకు అందిన సమాచారం ప్రకారం పోలింగ్ జరిగిన 96 నియోజకవర్గాలలో 62.31 శాతం పోలింగ్ నమోదైంది. ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది. అందువల్ల పోలింగ్ శాతంపై మంగళ వారం మధ్యాహ్నానికి గాని స్పష్టత రాదు. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం, మధ్యప్రదేశ్‌లో 68.01 శాతం, జార్ఖండ్‌లో 63.14 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 56.35 శాతం, బీహార్‌లో 54.14 శాతం పోలింగ్ నమోదైంది. జమ్మూ కశ్మీర్ లోని శ్రీనగర్ లోక్‌సభ నియోజక వర్గానికి సోమవారం పోలింగ్ జరిగింది. 2019 ఆగస్టు అయిదున కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని మోదీ ప్రభుత్వం రద్దు చేసిన తరవాత శ్రీనగర్‌లో జరిగిన ఎన్నికే మొట్ట మొదటిది. మధ్యాహ్నం మూడు గంటల వరకు అందిన సమాచారం ప్రకారం కేవలం 35.75 శాతం ఓట్లు మాత్రమే పోలైనాయి. ఇది అక్కడి ప్రజల నిరాసక్తతకు సంకేతం. శ్రీనగర్ పట్టణంలో కేవలం 14.43 శాతం ఓట్లు మాత్రమే పోలైనాయి. ఆంధ్ర ప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాలకు, 175 స్థానాలున్న అసెంబ్లీ, తెలంగాణ లోని 17 లోక్‌సభ సీట్లకు కూడా సోమవారమే పోలింగ్ జరిగింది. ఒడిశా శాసనసభలోని 28 సీట్లకు కూడా సోమవారమే పోలింగ్ జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లో 13, మహారాష్ట్రలో 11, బెంగాల్, మధ్యప్రదేశ్‌లో చెరి 8, బీహార్‌లో అయిదు, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలలో నాలుగేసి స్థానాలకు పోలింగ్ జరిగింది. నాలగవ విడత పోలింగ్‌తో 379 స్థానాలకు పోలింగ్ పూర్తి అయింది. నాలగవ విడత పోలింగ్ సరళి గురించి నిర్దిష్టమైన సమాచారం అందనప్పటికీ మొదటి మూడు విడతల పోలింగ్‌లో జనం అనాసక్తితో పాటు మోదీ నాయకత్వంలోని బీజేపీపై విముఖత ప్రముఖంగా వ్యక్తం అయింది. నాలుగో విడత పరిస్థితి కూడా అంతకన్నా భిన్నంగా ఏమీ లేదు. కనౌజ్ నుంచి పోటీ చేస్తున్న సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, బెంగాల్‌లోని కృష్ణనగర్ నుంచి పోటీ చేస్తున్న మహువా మొయిత్ర, బీహార్‌లోని బెగుసరాయ్ నుంచి పోటీ చేస్తున్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, బెంగాల్‌లోని బర్హంపూర్ నుంచి పోటీ చేస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి, కడప నుంచి పోటీ చేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల, బెంగాల్ లోని అసన్‌సోల్ నుంచి పోటీ చేస్తున్న సినీ నటుడు శతృఘ్న సిన్ హా, తెలంగాణలోని హైదరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ భవిష్యత్తు నాల్గో దశ పోలింగ్‌లోనే తేలనుంది.

2019 ఎన్నికలలో సోమవారం పోలింగ్ జరిగిన 96 స్థానాల ఫలితాలను చూస్తే బీజేపీ 42 సీట్లు, కాంగ్రెస్ ఆరు సీట్లు గెలుచు కున్నాయి. స్థూలంగా మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ.కు అనుకూలంగా

బీజేపీకి ఎదురుగాలి

వ్యవహరిస్తున్నప్పటికీ ఎన్.డి.ఎ.లో భాగస్వామ్యం లేని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ 2019లో 22 సీట్లు సంపాదించింది. ఈసారి బిజూ జనతాదళ్‌తో పొత్తు పెట్టుకోవాలన్న మోదీ ప్రయత్నం నెరవేర లేదు. మొదటి నుంచి బీజేపీని ఎదుర్కొంటున్న మమతా బెనర్జీ నాయకత్వం లోని తృణమూల్ కాంగ్రెస్ "ఇండియా" ఐక్య సంఘటనలో భాగస్వామి. సోమవారం పోలింగ్ జరిగిన నియోజకవర్గాలను పరిశీలిస్తే ప్రాంతీ యంగా బలంగా ఉన్న పార్టీల బలాబలాలు ఏమిటో తేలిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం లోని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ఎన్.డి.ఎ.లో భాగస్వామి కానప్పటికీ పార్లమెంటులో బీజేపీకే మద్దతు ఇస్తూ వచ్చింది. మరో వేపు జగన్‌తో తలపడుతున్న చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన బీజేపీతో పొత్తు కూడాయి. అంటే ఆంధ్ర ప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్షాలు అంతిమంగా బీజేపీని సమర్థించేవే. సోమవారం 96 సీట్లకు పోలింగ్ జరిగితే బీజేపీ 70 స్థానాలకు, బీజేపీతో పొత్తు పెట్టుకున్న తెలుగు దేశం 17 సీట్లకు, జనసేన రెండు సీట్లకు, మహారాష్ట్రలో బీజేపీకి అనుకూలమైన షిండే నాయకత్వంలోని శివసేన మూడు స్థానాలకు పోటీ చేస్తున్నాయి. "ఇండియా" ఐక్య సంఘటనలోని పక్షాలలో కాంగ్రెస్ 61 స్థానాలకు, సమాజ్‌వాదీ పార్టీ 19 చోట్ల, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన వర్గం, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ చెరి నాలుగు సీట్లకు పోటీ చేస్తున్నాయి. ఈ దశ పోలింగ్ జరిగిన స్థానాలను బట్టి చూస్తే ఎన్.డి.ఎ.తో గానీ, "ఇండియా" ఐక్య సంఘటనకు గానీ సంబంధం లేని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ 22 సీట్లు, బిజూ జనతాదళ్ 2 స్థానాలు, కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని బి.ఆర్.ఎస్.కు 9 సీట్లు 2019లో దక్కాయి. ఇటీవల తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. బి.ఆర్.ఎస్. కుదేలైంది. గత పక్షం రోజులుగా కె.చంద్రశేఖరరావు ఎంత శ్రమపడ్డా పెద్దగా ఫలితం ఉండదన్నది పరిశీలకుల అంచనా. తృణమూల్ కాంగ్రెస్ "ఇండియా" సంఘటనలో భాగస్వామి అయిన ప్పటికీ అక్కడ కాంగ్రెస్ తో ఎలాంటి పొత్తూ పెట్టుకోలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాక ముందు ఒడిశాలో అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ నాయకత్వం లోని బిజూ జనతాదళ్‌కు, బీజేపీకి మధ్య పొత్తు కుదురుతుందన్న అంచనాలు తారు మారయ్యాయి. పొత్తు కుదరనందుకు మోదీ ఒడిశా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్‌పై ఒంటి కాలి మీద లేస్తున్నా, ఆయనను కించపరిచే రీతిలో మాట్లాడుతున్నా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడ్తుం దన్న భయంతోనే బిజూ జనతాదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకో లేదనిపి స్తోంది. పొత్తు లేకపోయినా బిజూ జనతాదళ్ అధికారికంగా ఎన్.డి.ఎ.లో భాగస్వామి కాకపోయినా ఆచరణలో ఎటూ బీజేపీకే మద్దతు పలకడం ఖాయం. తెలంగాణలో బి.ఆర్.ఎస్. బలహీన పడినందువల్ల కాంగ్రెస్‌తో ముఖాముఖి తలపడాలని బీజేపీ భావిం చింది. కానీ బీజేపీకి అంత అవకాశం లేదు. జార్ఖండ్ మాజీ ముఖ్య మంత్రి హేమంత్ సొరేన్ అవినీతి ఆరోపణలతో జైలులో ఉన్నారు. ఆయన నాయకత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.) "ఇండియా" ఐక్య సంఘటనలో భాగస్వామి. హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేసినందుకు ఆయన మీద ఉన్న సానుభూతి "ఇండియా" ఐక్య సంఘటనకు తోడ్పడవచ్చు. మొదటి మూడు విడతల్లో లాగే నాల్గో విడతలోనూ బీజేపీకి ఎదురుగాలే కనిపించింది.

కర్తవ్యం

– చింతపట్ల సుదర్శన్

ఉన్నచోటే నిలబడి ఒళ్లు విరుచుకుంది డాగీ. వీపు సాగదీసింది. నాలుకతో మూతి రాసుకుంటూ తోక ఊపసాగింది. డాగీ చేష్టలు డాంకీకి అర్థమైనవి. హలో బ్రదర్! ఏమిటా హడావిడి. ఎక్కడికి బయలుదేరావు అంది. ఎక్కడికేమిటి? పొట్ట తిప్పలు అందరికీ తప్పవు కదా. బ్రేక్‌ఫాస్టో, లంచో, రెక్కాడితే కాని డొక్కాడదు మరి అంది డాగీ. నువ్వు ఇప్పుడు అరుగు దిగితే రెక్క సంగతేమో కాని డొక్క మాత్రం చిరుగుద్ది జాగ్రత్త. ఏం? ఎందుకని? అంది డాగీ. నిన్నటి పేపర్ తింటుంటే తెలిసింది. పెద్ద

రంగస్థలం

బజారులో ఓ వీధి కుక్క పదిమందిని కరిచిందట. జనం గగ్గోలు పెడుతున్నారట. కుక్క కనబడితే కొట్టి చంపడానికి కర్రలతో తిరుగుతున్నారట. ఆ కుక్కనేనా? కుక్కలన్నింటినీనా? ఏ కుక్క కరిచిందో ఎవ్వడెరుగు కనిపించిందాన్నలా కొట్టి చంపుతారు. నువ్వివ్వాళ శివరాత్రి అనుకుని 'ఫాస్టింగ్' పాటించు. మధ్యాహ్నం ఎవరూ లేని వేళల్లో చెత్తకుండీకి వెళ్దువుగాని అంది డాంకీ.

అదెక్కడి కుక్కో? ఎవర్ని కరిచిందో! మధ్యన నాలాంటి అమాయకులు బలవ్వాల్సిందేనా! అసలు కరవడమెందుకు ఊరికే అరిస్తే సరిపోదా మీకు అంది డాంకీ. జనరల్‌గా జనం మాజోలికి వస్తే భయపెట్టటానికి అరుస్తాం కానీ తప్పని సరైతే తప్ప కరవం. ఒకవేళ ఏ కుక్కయినా కరిస్తే అందుకు బాధ్యులు దేశాన్ని ఏలే రాజకీయ నాయకులే అంది డాగీ. ఇదే మరి 'ఓవరాక్షన్' అంటే. రాజకీయ నాయకులకు వీధి కుక్కలకు సంబంధ మేమిటసలు. మీలాగానే వాళ్లూ అరుస్తారు. అదొక్కటే కదా కామన్ పాయింటు. అది అందరికీ తెల్సిన 'ఫ్యాక్టే' కానీ వీళ్లు చెయ్యబట్టే కదా ఊళ్లో చెట్టు అనేది లేకుండా పోయింది. వీళ్ల అండ వల్లేకదా రియల్ ఎస్టేట్ బిజినెస్ బరి తెగిస్తున్నది. చెరువుల్ని తాగేస్తున్నది, గుట్టల్ని నమిలేస్తున్నది. ఏటేటా కోటి చెట్లు నాటుతాం అని హంగామా చేస్తారు కానీ కనీసం ఈ ఊళ్లో మాలాంటి కుక్కలం 'రెస్టు' తీసుకోవడానికి చెట్టు నీడ కూడా లేకుండా చేశారు. ఈ ఎండల తీవ్రతకు ఏ కుక్క తల్లో అయినా పురుగు తిరక్క మానదు. అలా తిరిగినప్పుడు కసితీరా మనుషుల్ని కరవాలని ప్రతి కుక్కకూ నాతో సహా అనిపిస్తుంది. నేరం మాది కాదు పర్యావరణాన్ని చించి పోగులు పెడ్తున్న ప్రభుత్వాలది. ప్రభుత్వాలను తాము డబ్బిచ్చి కొనుక్కున్న ఓట్లతో, నడిపిస్తున్న ప్రజా ప్రతినిధులది అంది కుక్క అలుపు తీర్చుకోడానికి కింద కూలబడుతూ.

కనీసం కుక్కల కన్నా కూచోడానికి చెట్టునీడ లేదని పిచ్చెక్కి పోతున్నాయని దారెంట పోయేవాళ్లకు 'బైటింగ్ గ్రీటింగ్స్' చెప్తున్నాయంటున్నావు ఓ.కే. కానీ ఓట్లు కొనుక్కున్న ప్రభుత్వాలనే మాటే 'కన్‌ఫ్యూజింగ్' గా ఉంది అంది డాంకీ. నేనన్న దాంట్లో మామూలు నిజం కంటే పచ్చి నిజమే ఎక్కువ. మొన్న సాయంత్రం ఆ ఎదురుగ్గా ఉన్న అపార్టుమెంటు వాళ్లందరినీ వాళ్ల ఊర్లకి తీసుకుపోవడానికి టూరిస్టు బస్సులు వచ్చినవి కదా. బస్సు ఎక్కే వాళ్లల్లో ఒకడు మూడు వేలంటే మరొకడు ఐదువేలు అనడం వినలేదా నువ్వు. ఓటుకింత అని ఇస్తే తప్ప ఓటు వెయ్యం అనే ఓటర్లు ఎందరో ఉన్నారు. ఓటుకు నోటు సరే, ఓటేస్తే అన్ని పార్టీల వారూ పోటీలు పడి ఇస్తామనే ఉచితాలు అన్నీ బహిరంగ 'లంచ' ప్రకటనలే కదా! విద్య, వైద్యం, ఉద్యోగం గురించి ఎవరన్నా హామీలు ఇస్తున్నారా. మహా అయితే ఎవరయినా ఓ కోటి ఉద్యోగాలిస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చినా జనం నమ్మరు. అందరూ బలంగా విశ్వసించేది ఉచితాలను మాత్రమే. అందువల్ల ప్రభుత్వాల్ని డబ్బిచ్చి కొనుక్కుంటున్నారు అన్నాను, అక్షరం పొల్లు పోదు నా మాటల్లో అంది డాగీ.

అంటే డబ్బు, ఉచితాలు అందుతాయంటే తప్ప ఓట్లు వెయ్యరా ఎవ్వరూ? పౌరులకు బాధ్యతన్నదే లేదని ఆరోపిస్తున్నావా? 'దీసీజ్ టూ మచ్' అంది డాంకీ. 'త్రీ మచ్' అనుకున్నా ఫర్లేదు. మన గ్రౌండుకు ఎదురుగ్గా ఉన్న ఇంట్లో ఎనభై అయిదు ఏళ్లు దాటిన భార్యాభర్తలు ఇద్దరి చేతా ఓట్లు వేయించుకున్నారు అధికార్లు కారులో వచ్చి చూశావు గదా! అది పాత జనరేషన్ కమిట్‌మెంట్. ఓటు వెయ్యకపోతే ఏదో తప్పు చేశామన్న భావన ఉండేది వాళ్లల్లో. ఇప్పటి యంగ్ పీపుల్ని చూడు. ఎన్నికల రోజు 'హాలీడే' ఎంజాయ్ చేసేవాళ్లే ఎక్కువ. ఓటు వేయడంవల్ల ఒరిగేదేమిటి? అన్ని పార్టీలూ ఒక్కటే, అందరు లీడర్లూ ఒకటే. పదవుల కోసం పార్టీలు మార్చేవాళ్లే. మన డబ్బుతో ఉచితాలు ఇవ్వడానికి, కోట్లు కూడబెట్టుకోవడానికి, వాళ్లకు ఓట్లు వెయ్యడం అవసరమా? మనం వెయ్యకపోతే ప్రజాస్వామ్యం బతకదా? బట్టకట్టదా? అనే వాళ్లే ఎక్కువ. ఓటింగు శాతం చూస్తే తెలుస్తుంది అని డాగీ అంటుండగా అరుగు ఎక్కాడు అబ్బాయి. ఓటింగ్ శాతం దాకా వెళ్లిందా మీ డిస్కషన్ అన్నాడు కూర్చుంటూ. చూడు తంబీ ఇవాళ మన డాగీ 'చాలా హాట్ గురూ' అన్నట్టు దంచేస్తున్నది అంది డాంకీ. ఉచితాల కోసమూ, బటన్లు నొక్కించుకోడం కోసమూ, ఓటు వేసే వాళ్లు ఎక్కువయ్యారని, ఈతరం వాళ్లు ఎలక్షన్‌లను 'లైట్' తీసుకుంటున్నారని, చాలామంది ఓటు వెయ్యడానికి ఇళ్లల్లోంచి కదలడం లేదని, చదువుకున్న వాళ్లూ, అన్నీ తెలిసిన వాళ్లూ 'రెస్పాన్సిబిల్' గా ఫీలయ్యి ఓటు వెయ్యకపోతే నీతీ, జాతీ, మంచీ, మానవత్వం మంటగలిసిపోతున్నాయన్నది డాగీ.

ఏవో కుంటిసాకులు చెప్తూ, ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం అయ్యే విధంగా ప్రవర్తించకుండా అందరూ ఓటు వెయ్యడం తమ కర్తవ్యం. ఈసారి జనం ఆ కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తించకపోతే మళ్లీ ఎన్నికలప్పుడు 'ఓటు వెయ్యనివాడు నాతో సమానం' అని వీపు మీద పెద్దపెద్ద అక్షరాలతో రాయించుకుని ఊరంతా తిరుగుతా అంది డాగీ.

అబద్ధాల చక్రవర్తికి లేరెవ్వరూ సాటి!!

షాయిస్తా ఖానూమ్ పఠాన్

అబద్ధం... ఓ అందమైన నిజం. ఇందుకు ప్రతి రూపమే మన నరేంద్రుడు. నోరు విప్పారంటే ఆగవు అసత్య బాణాలు. అసత్యాల వాక్కులలో లేరెవ్వరూ ఆయనకు సాటి. దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగు దశలు ముగిశాయి. ప్రతి దశ తర్వాత కమలం కోటలో బీటలు పెద్దవవుతున్నాయి. ఓటమికి చేరువవుతున్నామని గ్రహిస్తున్న కమలనాథులు ఆందో ళనకు గురవుతున్నారు. గందరగోళ పరిస్థితుల్లో ఎన్నికల వేళ కాషాయ కుయుక్తులు ప్రదర్శిస్తున్నారు. విపక్షాలపై బురద జల్లడంలో, మైనారి టీలపై విషం చిమ్మడంలో.... ఉన్నది లేనట్లు... లేనిది ఉన్నట్లు సృష్టించడంలో రారెవ్వరూ తమకు సాటని నిరూపిస్తున్నారు.

నరేంద్రుడి అబద్ధాలలో కొన్ని....

1) మే 8 : 'అంబానీ, అదానీ గురించి రాహుల్ మాట్లాడటంలేదు

ఈ వ్యాఖ్యలను తెలంగాణలోని కరీంనగర్‌లో నిర్వ హించిన బీజేపీ ప్రచార ర్యాలీలో నరేంద్ర మోదీ చేశారు. గౌతం అదానీ, ముకేశ్ అంబానీలతో కాంగ్రెస్‌కు ఒప్పందం కుదిరిందని అవినీతి సొమ్ముతో అందిన ముడుపులను స్వాహా చేసి నోరు మెదపడం లేదని ఆరోపించారు.

నిజం ...

ప్రధాని మోదీ పూర్తిగా అబద్ధం చెప్పారని నిజ నిర్ధారణ జరిగింది. కాంగ్రెస్ ఎప్పుడూ కూడా అంబానీ, అదానీ విషయంలో మౌనం వహించలేదని తేలింది. గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యాపారవేత్తలు అంబానీ–అదానీకి దేశాన్ని దోచి పెడుతున్నదని మోదీ ప్రభుత్వమేననీ ప్రతిపక్ష నేతలు తరచూ విమర్శలు చేస్తుంటారు. రాహుల్ అనేక ప్రసంగాల్లో ఈ ఇద్దరు పారిశ్రామిక వేత్తల గురించి మాట్లాడారు. ఈనెల 7న జార్ఖండ్‌లోని కోంబిర్‌లో నిర్వహిం చిన ప్రచార సభలోనూ అంబానీ, అదానీ ప్రస్తావనను రాహుల్ తెచ్చారు. గిరిజనులకు చెందిన అటవీ భూములను ఈ ఇద్దరికి దారాదత్తం చేయాలని బీజేపీ కోరుకుంటోందని వ్యాఖ్యానిం చారు. అంబానీ ఇంట్లో జరిగే పెళ్లి వేడుకను 24 గంటలు ప్రసారం చేస్తారు కానీ ఓ గిరిజనుడు హత్యకు గురైనా, చేతులు జోడించి వేడుకుంటున్న సన్నివేశాలను మీడియా చూపించదని విమర్శించారు. అలాగే మధ్య ప్రదేశ్‌లోని ఖర్గోనేలో ఈనెల 6న జరిగిన ర్యాలీలోనూ జల్– జంగల్– జమీన్ అంటూ రాహుల్ మాట్లాడారు. 'హిందూస్తాన్‌ను 22–25 మంది పాలిస్తారు. వీరంతా ఎవరో కాదు మన దేశంలోని సంపన్నులు' అని ఘాటు విమర్శలు చేశారు. అదానీ వంటి వారు మీ భూములు, అడవులు, నీటి వనరులపై కన్నే శారని, వాటిని స్వాహా చేయాలని చూస్తు న్నారని, ఇందుకోసం వారికి వారి ఆప్తమిత్రుడు నరేంద్ర మోదీ సహాయ సహకారాలు అందజేస్తున్నారని దుయ్యబట్టారు. 22–25 మందికి రూ.16 లక్షలకోట్ల రుణాలను మోదీ మాఫీ చేశారని వ్యాఖ్యానించారు.

2) మే 7: 'ఓటు జిహాద్' కోసం కాంగ్రెస్ పిలుపునిచ్చింది

మధ్యప్రదేశ్‌లోని ఖర్గోనేలో నిర్వహించిన ప్రచారంలో నరేంద్ర మోదీ 'ఓటు జిహాద్' గురించి ఇలా మాట్లాడారు. మీకు ఓటు జిహాద్ కావాలో రామ రాజ్యం కావాలో తేల్చుకోండి. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు భారత్‌లో జిహాద్

చేస్తున్నారు. మాకు వ్యతిరేకంగా ఓటేసేందుకు ఒక మతం వారంతా ఏకమయ్యారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల రిజర్వే షన్లను ముస్లింలకు కాంగ్రెస్ దోచిపెట్టనున్నది. కశ్మీర్‌లో అధికరణ 370 పునరుద్ధరణ, మతాధారంగా క్రీడాకారుల ఎంపిక వంటి అంశాలతో మతచిచ్చు పెట్టాలని చూశారు. ముస్లింలను బూచీలుగా చూపుతూ హిందువుల ఓట్లను దండుకోవాలని మత రాజకీయాలను కొనసాగిస్తున్నారు.

నిజం ...

ప్రధాని మాటల్లో ఏ మాత్రం నిజం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోగానీ ప్రచార ప్రసంగాల్లోగానీ 'ఓటు జిహాద్' మాటే రాలేదు. హిందువుల సొమ్ములను ముస్లింలకు దోచిపెట్టే అంశం ఎక్కడా లేదు. అధికరణ 370 ప్రస్తావన లేదు. 1985లో రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండి, యూపీలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బాబ్రీ మసీదు తాళాన్ని తెరపించారు. కాగా, క్రీడల విషయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇలా పేర్కొన్నది "21ఏళ్లలోపు నైపుణ్యవంతులైన క్రీడాకారులకు నెలకు రూ.10వేల స్కాలర్‌షిప్ లిస్తాం. ప్రతి జిల్లాలో బహు క్రీడల కోచింగ్ సెంటర్, ప్రతి మున్సిపల్ పట్టణం, మండ లంలో కమ్యూనిటీ స్పోర్ట్స్‌కు హామీనిస్తున్నాం. బాలికలు, మహి ళలు, దివ్యాంగులు, ఎస్టీ తరహా అణగారిన వర్గాల వారిలో క్రీడలను ప్రోత్సహించేలా సముచిత నిధులను కల్పిస్తాం".

3) ఏప్రిల్ 29: ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు కాంగ్రెస్ దోచిపెడుతోంది

మహారాష్ట్రలో ప్రచారం నిర్వహించిన సమయంలో మోదీ మరో ఆలోచన లేకుండా అవాస్తవాలు పలుకుతూ మోదీపై దాడి చేశారు. షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీ) రిజర్వేషన్లను ముస్లిం లకు దోచిపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ఆ వర్గం మెప్పు పొందే ప్రయత్నాన్ని కాంగ్రెస్ చేస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

నిజం...

ముస్లింలకు ప్రత్యేకించిన రిజర్వేషన్ల గురించి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఏమీ లేదు. రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. కులమతాలతో పనిలేకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) వారికి విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమిలో భాగంగా ఉన్న తెలుగు దేశం పార్టీ (టీడీపీ) అధినేత చంద్రబాబు నాయుడు ఆ రాష్ట్ర ముస్లిం ఓటర్లకు నాలుగు శాతం కోటా కల్పిస్తామని ప్రతి ప్రసంగంలోనూ హామీనిచ్చారు. కానీ మోదీ ఎక్కడా కూడా దీని గురించి ప్రస్తావించలేదు.

4) ఏప్రిల్ 21: మీ డబ్బు, బంగారం, ఆస్తులు, మంగళసూత్రాలను సైతం ముస్లింలకు కాంగ్రెస్ దోచిపెడుతుంది. ఆస్తులపై మొదటి హక్కు ముస్లింలదే అని కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో నిర్వహించిన ప్రచారంలో మోదీ ఈ మేరకు అబద్ధాలు పలికారు

నిజం ...

ప్రత్యేకించి ఒక వర్గానికి దేశ సంపదను తిరిగి పంపిణీ చేయడం గురించి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఏమీ లేదు. పెరుగుతున్న అసమానతలు, సంపద మొత్తం ఒకశాతం వద్ద కేంద్రీకృతం కావడాన్ని ప్రస్తావిస్తుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 2006లో ఇచ్చిన ప్రసంగాన్ని మోదీ తప్పుగా అన్వయించుకొని అవాస్తవాలను ప్రచారంచేశారు. మన్మోహన్ ఏం చెప్పారంటే "అభివృద్ధి ఫలాలను సమా నంగా పంచడానికిగాను మైనారిటీలు ముఖ్యంగా ముస్లింల సాధికారత కోసం వినూత్న ప్రణాళికలను రూపొందించు కోవాల్సి ఉన్నది". మోదీ మాత్రం తనకు తోచిన వ్యాఖ్యలను 2006 నుంచి 2024 వరకూ చేస్తుండటం ఆయన విజ్ఞతనే ప్రశ్నించే పరిస్థితి వచ్చింది. తమ మేనిఫెస్టోలో హిందూ, ముస్లిం అని చూపగలరా అంటూ మోదీకి కాంగ్రెస్ సవాల్ విసిరింది. యువత, మహిళలు, రైతులు, గిరిజనులు, మధ్య తరగతి, కార్మికులకు న్యాయం గురించి మేము ప్రస్తావించాం. దానినీ కాదంటారా అని ప్రశ్నించింది. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అంతమైపోతే అంబేద్కర్, నెహ్రూ ఆకాంక్షించినట్లు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండదని, ఆ హక్కు వల్లనే అన్ని వర్గాలకు సముచిత గౌరవం లభించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓ సందర్భంలో అన్నారు.

మోదీ విద్వేష ప్రసంగాల చరిత్ర

గుజరాత్ రాష్ట్రాన్ని 12 ఏళ్లు ఏలారు. ముఖ్య మంత్రిగా ఉండి ముస్లిం మైనారిటీ వర్గమే లక్ష్యంగా విద్వేష ప్రసంగాలు చేశారు. 2002లో గోధ్రా అల్లర్లు, ముస్లింల ఊచకోత తర్వాత కూడా వారిని బలవంతంగా రాష్ట్రంలో ఉంచారు. హింసాకాండ జరిగిన కొద్ది కాలానికే గుజరాత్ గౌరవ్ యాత్ర జరిగింది. ఉత్తర గుజరాత్‌లోని మెహసానా జిల్లాలోని బెచరాజీ వద్ద ర్యాలీలో మోదీ ప్రసంగించారు. 'మేము ఏం చేయాలి? వాళ్ల కోసం పునరావాస కేంద్రాలు నిర్వహించాలా? పిల్లల పుట్టే కేంద్రాలు తెరవాలా? వారికి హమ్ పాంచ్... హమారే పచ్చీస్ (మేము ఐదుగురం... మాకు 25 మంది)గా అవి మారుతాయి' అని అమానుష వ్యాఖ్యలను మోదీ చేశారు. 2017లోనూ ముస్లింలే లక్ష్యంగా ఉత్తరప్రదేశ్‌లో, ఆ తర్వాత గుజరాత్ ఎన్నికల ప్పుడు విద్వేష ప్రసంగాల హవా నడిచింది. 'షంషాన్ వర్సెస్ కబరిస్తాన్' (శ్మశానానికి, కబరిస్తాన్)కు పోటీ అన్నట్లు సాగింది. 2017, డిసెంబరు 10న పాలన్ పూర్‌లో మోదీ ప్రసంగిస్తూ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫిక్సింగ్ కోసం పాకిస్థాన్‌లో రహస్య సమావేశం జరిగినదంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ నివాసంలో ఈ సమావేశం జరిగిందని, పూర్వ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ఆర్మీ చీఫ్ దీపక్ కపూర్, దౌత్యాధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ద్వారా దాఖలైన ఆర్టీఐకి ఇచ్చిన సమాధానంతో మోదీ పీఎంఓ సిగ్గుతో తలవంచుకున్నది... అనధికారిక సమా చారం ఆధారంగా మోదీ ప్రసంగం సాగినట్లు సమర్థించుకునే నిసిగ్గు ప్రయత్నం చేసింది. 2023లో అమెరికా అధ్యక్షుడితో కలిసి విలేకరుల సమావేశంలో మోదీ పాల్గొన్నారు. 'భారత దేశం ప్రజాస్వామ్యం అంటారు కానీ అక్కడ మానవహక్కుల హరణ జరుగుతోంది. మైనారిటీలు వివక్షకు గురవుతున్నారు. ఇప్పుడు మీరు శ్వేతసౌధంలో ఉన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సంకల్పించిన ప్రపంచ నేతల మధ్య ఉన్నారు. ముస్లింలు, ఇతర మైనారిటీల హక్కుల మెరుగుదలకు మీరు, మీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది. భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్ స్వేచ్ఛకు హామీనిచ్చే చర్యలు ఏమిటి'? అని ఒక విలేకరి ప్రశ్నించారు. నరేంద్ర మోదీని ఖంగుతిని ఎలాంటి సమాధానం చెప్పాలో అర్థంకాక తడబడిన ఆయన వెంటనే అవన్నీ నిరాధార ఆరోపణలంటూ కొట్టిపారేశారు.

ఆదర్శ ప్రజానేత సెల్వరాజ్

మోదుమూడి మురళీకృష్ణ

కుల, మత, వర్గ దురాగతాలకు వ్యతిరేకంగా, గ్రామీణ పేదలకు భూమి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, లోక్‌సభ సభ్యులు మునియన్ సెల్వరాజ్ అవిశ్రాంత కృషి సల్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాల్లో ఎప్పుడూ ముందే ఉండేవారు. ఆదర్శవంతమైన ప్రజానాయకుడు. సీపీఐ ప్రముఖ నాయకుడు అయిన సెల్వరాజ్ అనుభవజ్ఞుడు, అంకితభావం కలిగిన ప్రజా సేవకుడు మాత్రమే కాదు, రైతు, సామాజిక కార్యకర్త కూడా. ఆయన నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికై ప్రజాసమస్యల పరిష్కా రానికి తనదైన శైలిలో కృషి చేశారు. దశాబ్దాలుగా రాజకీయ రంగంలో తన ఉనికిని చాటుకున్నారు. నాలుగు సార్లు లోక్ సభకు ఎన్నికైనా ఆయన ప్రజాభిమానంలో కోటీశ్వరుడు, సం పదలో పేదవాడే. ఎంపీగా వచ్చే పెన్షన్, వారసత్వంగా వచ్చిన కొంత వ్యవసాయ భూమే ఆయన ఆస్తి. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ, ప్రజా సేవ పట్ల ఆయన నిబద్ధత ఏమాత్రం సడలలేదు. అచంచలంగా ఉంది, సహచరులు, నియోజకవర్గ ప్రజలలో అపారమైన గౌరవం, ప్రశంసలను పొందారు.

1975లో సీపీఐలో చేరిన సెల్వరాజ్ దాదాపు అర్ధశతాబ్దం పాటు సోషలిస్టు ఉద్యమానికి అంకితమై సమసమాజ స్థాపన కోసం పనిచేశారు. తమిళనాడులోని నాగపట్నం నియోజకవర్గం నుంచి ఆయన లోక్‌సభకు నాలుగు దఫాలు ఎన్నికయ్యారు. నాలుగు సార్లు లోక్‌సభ సభ్యుడిగా పనిచేసిన సెల్వరాజ్ ఆస్తి ప్రజాభిమానమే. 67 ఏళ్ల సెల్వరాజ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం అర్ధరాత్రి దాటాక తుదిశ్వాస విడిచారు. తిరువారూరు జిల్లా చిట్టమల్లికి చెందిన సెల్వరాజుకు గత జనవరిలో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ సోకింది. వెంటనే తిరువారూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించి తదుపరి చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయన మృతితో కమ్యూనిస్టు ఉద్యమం ఒక అంకితభావం కలిగిన నాయకుడిని కోల్పోయింది. తమిళనాడు రాష్ట్ర ప్రజలు పిలిస్తే పలికే, నిబద్ధత కలిగిన నేతను కోల్పోయారు. 50 సంవత్సరాల క్రితం నాగపట్నంలోని వెన్మనై గ్రామంలో స్థానిక భూస్వాములు 29 మంది మహిళలు, పిల్లలతో సహా 44 మంది వ్యవసాయ



కూలీలను (ఎక్కువగా దళితులు) గుడిసెలో బంధించి తగులబెట్టిన దారుణ ఘటనను సెల్వరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. బాధితులకు సీపీఐ, సీపీఎం అండగా నిలిచాయి. ఈ పోరాటంతో పాటు గ్రామాల్లో వ్యవసాయ వేత నాలు, భూ పంపిణీకి జరిగిన మహత్తర పోరాటాలకు సెల్వరాజ్ నాయకత్వం వహించారు. చాలా ప్రబలంగా ఉన్న అంటరాని తనం, దళితుల ఆలయ ప్రవేశంపై నిషేధానికి వ్యతిరేకంగా సెల్వరాజ్ అలుపెరగని పోరాటం సల్పారు. కావేరి డెల్టా బ్లాక్ ప్రజల సమస్యలపై పోరాడి, కావేరిపై మధ్యవర్తిత్వ న్యాయస్థానం ఏర్పాటుకు 110 కిలోమీటర్ల మానవహారం నిర్వహించడంలో సెల్వరాజ్ పాత్ర ఎనలేనిది.

ప్రస్తుతం తిరువారూర్ జిల్లా పరిధిలోని నీడమంగళం టౌన్ పంచాయతీ కప్పలుదయాన్ గ్రామంలో 1957లో జన్మించిన సెల్వరాజ్ చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. విద్యార్థి, యువజన సంఘాలైన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)లో అనేక కీలక పదవులు నిర్వహించారు. సీపీఐ నీడమంగళం శాఖ కమిటీ సభ్యునిగా ప్రారంభమైన సీపీఐలో సెల్వరాజ్ ప్రస్తానం నాగపట్నం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, జాతీయ సమితి సభ్యుని స్థాయికి చేరింది. సెల్వరాజ్ మొట్ట మొదటగా 1989లో నాగపట్నం నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1996, 1998, 2019లో కూడా ఇదే నియోజకవర్గం నుంచి ఆయన లోక్‌సభకు ఎన్నికై నియోజకవర్గ అభివృద్ధికి చేసిన విశేష కృషి చిరస్మరణీయం. డెల్టా ప్రాంత ప్రజల హక్కుల కోసం, రైతుల కోసం సమస్యల పరిష్కారానికి ఎంపీగా అనేక నిరసనలు చేపట్టారు. అనేక కొత్త రైల్వే ప్రాజెక్టులను సాధించడంలో పార్లమెంట్ సభ్యునిగా కీలక పాత్ర పోషించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించారు. గ్రామీణ ప్రజలలో ప్రజా సమస్యలు, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తూ, పోరాట స్ఫూర్తిని నింపారు. నిరక్షరాస్యత నిర్మూలనకు, అక్షరాస్యత పెంపుదలకు కృషి చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయంలో కొత్త పద్ధతులు అనుసరించేలా అవగాహన కల్పించారు. పార్లమెంట్ సభ్యునిగా పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సభ్యునిగా, రసాయనాలు, ఎరువులపై స్థాయీ సంఘం సభ్యునిగా పనిచేశారు. పార్లమెంట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేవారు. వివిధ అంశాలపై చర్చల్లో పాల్గొనే వారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న కావేరి నీటి అంశం పరిష్కారానికి తన వంతు కృషి చేశారు. ఈ ప్రాంత రాజకీయ, సామాజిక నిర్మాణంపై సెల్వరాజ్ చెరగని ప్రభావాన్ని చూపారు. అనారోగ్య కారణాల వల్ల ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఆయన పోటీచేయలేదు. సెలర్వాజ్ మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో సెల్వరాజ్‌ది ఎనలేని పాత్రగా ప్రశంసించారు. సీపీఐ జాతీయ, రాష్ట్ర సమితి, రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు సెల్వరాజ్ మృతికి కమ్యూనిస్టు ఉద్యమానికి, పేదల పోరాటానికి తీరని లోటుగా పేర్కొన్నారు.

సమరాంగణం 2024

చౌతాలా vs చౌతాలా

హిసార్ బరిలో ముగ్గురు కుటుంబ సభ్యులు

ఢీ అంటే ఢీ అంటున్న ఇద్దరు కోడళ్లు

ప్రత్యర్థిగా నిలిచిన మామయ్య

హర్యానాలోని హిసార్ లోక్‌సభ స్థానంలో పోటీ రసవత్తరంగా మారింది. రాజకీయంగా అత్యంత ప్రభావవంతమైన చౌటాలా కుటుంబానికి చెందిన మగ్గురు ప్రస్తుతం రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నారు. హిసార్ నుంచి వేర్వేరు పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. బీజేపీ టికెట్‌పై రంజిత్ సింగ్ చౌటాలా, ఐఎన్‌ఎల్‌డీ తరపున సునైనా చౌతాలా, జేజేపీ నుంచి నైనా సింగ్ చౌటాలా బరిలో నిలిచారు. జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఎమ్మెల్యే నైనా చౌతాలా (57) అదే పార్టీ అధ్యక్షుడు అజయ్ సింగ్ చౌతాలా భార్య, హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలాకు తల్లి. అలాగే ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ) అభ్యర్థి సునైనా చౌతాలా (47) ఆ పార్టీ నేత అభయ్ సింగ్ చౌతాలా సోదరుడు రవి చౌటాలా భార్య కాగా రవి చౌటాలా ఐఎన్‌ఎల్‌డీ అధినేత ఓం ప్రకాశ్ చౌతాలా తమ్ముడు, కీశే పర్తప్ సింగ్ చౌతాలా కుమారుడు. ఇక రంజిత్ చౌతాలా (78) బీజేపీ తరపున బరిలో నిలిచారు. ఆయన మార్చిలో స్వతంత్ర ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. బీజేపీలో చేరిన తర్వాత సిర్సా జిల్లాలోని రైనా స్థానాన్ని వదులుకున్నారు. నయాబ్ సింగ్ సైనీ నేతృత్వ బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగానూ ఉన్నారు. రంజిత్ చౌతాలా పూర్వ ఉప ప్రధాని దేవిలాల్ తనయుడు, ఐఎన్‌ఎల్‌డీ అధ్యక్షుడు, హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలాకు సోదరుడు కూడా.

చౌటాలా కుటుంబ సభ్యులు ఇలా రాజకీయ ప్రత్యర్థులుగా మారి కత్తులు దూసుకోవడం ఇది మొదటిసారేమీ కాదు. గత రెండు దశబ్దాలకుపైగా ఈ కుటుంబంలో రాజకీయపరమైన పోటీ ఉంది. 20 ఏళ్ల కిందట రోరీ అసెంబ్లీ స్థానం నుంచి ఓం ప్రకాశ్ చౌతాలాపై కాంగ్రెస్ తరపున రంజిత్ చౌతాలా పోటీ చేశారు. అదే విధంగా దాబ్‌వేలిలో అజయ్ చౌతాలా, రవి చౌతాలా మధ్య పోటీ జరిగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నైనా, అజయ్ చౌతాలా కుమారుడు దుశ్యంత్ కూడా హిసార్ నుంచి పోటీ చేశారు కానీ బీజేపీ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్ చేతిలో ఓడిపోయారు. సింగ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం బరిలో నిలిచిన చౌతాలా కుటుంబానికి చెందిన ముగ్గురు అభ్యర్థులు కూడా హిసార్‌లో గెలుపు తమదేనన్న దీమాతో ఉన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు

హర్యానాలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయి. బీజేపీ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగుపోయారని కాంగ్రెస్ హిసార్ అభ్యర్థి జైప్రకాశ్ వ్యాఖ్యానించారు. ఈ సారి తన గెలుపుపై విశ్వాసంగా ఉన్నారు. ఈయన హిసార్ నుంచి మూడు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. జిల్లా పరిధిలోని బర్వాలా అసెంబ్లీ స్థానం నుంచి 2000లో ఎమ్మెల్యే అయ్యారు. 2014లో కైతల్‌లో కలాయత్‌కు ప్రాతినిధ్యం వహించారు. హిసార్ లోక్‌సభ స్థానం నుంచి జనతా దళ్ అభ్యర్థిగా 1989లో ఆయన మొదటిసారి ఎన్నికయ్యారు. అప్పట్లో కేంద్రమంత్రిగానూ పనిచేశారు. 1996లో హర్యానా వికాస్ పార్టీ తరపున హిసార్ నుంచి గెలిచారు. 2000 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై బర్వాలా నుంచి గెలిచారు. 2004లో హిసార్ ఎంపీగా ఎన్నికయ్యారు. హిసార్‌తో సహా తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

హిసార్ ఓటరల్లో జాట్లదే పైచేయి

హిసార్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లలో జాట్ వర్గీయులదే పైచేయిగా ఉన్నది. మొత్తం ఓటర్లలో మూడవ వంతుగా వీరున్నారు. దీంతో గెలుపోటములను ప్రభావితం చేయగలరు. హిసార్ ఓటర్లలో పురుషులు 9,52,598 మంది, మహిళలు 8,32,569 మంది, ట్రాన్స్‌జెండర్లు 11 మంది ఉన్నారు. 1966లో హర్యానాకు రాష్ట్ర హోదా దక్కిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదుసార్లు గెలుపొందింది. అయితే రెండు దశాబ్దాలుగా విజయానికి దూరంగా ఉంది. ఈసారి అనుకూల పరిస్థితులు ఉన్నందున గెలుపై దీమా వ్యక్తంచేస్తోంది.

25న పోలింగ్

సార్వత్రిక ఎన్నికల ఆరవ దశలో భాగంగా ఈనెల 25న హర్యానాలోని పది లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

ఐదవ దశ అభ్యర్థుల్లో మహిళలు 12శాతమే...

సార్వత్రిక ఎన్నికల నాల్గవ దశ ప్రశాతంగా ముగిసింది. ఐదవ దశకు రంగం సిద్ధమైంది. ఈనెల 20న పోలింగ్ జరగబోతోంది. ఈసారి మొత్తం 695 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో 12శాతం అంటే 82 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యం చాలా తక్కువగానే నాలుగు దశల్లో కనిపించింది. తాజా దశలో కేవలం 12శాతంగా ఉన్నదని ప్రజాస్వామ్య సంస్కరణల సమాఖ్య (ఏడీఆర్) వెల్లడించింది. మొదటి రెండు దశల్లో ఎనిమిది శాతం మంది చొప్పున మహిళా అభ్యర్థులు ఉన్నారు. తొలి దశలో 135 మంది, మలి దశలో 100 మంది పోటీ చేశారు. అలాగే మూడవ దశలో తొమ్మిది శాతం అంటే 123 మంది, నాల్గో దశలో 10శాతం అంటే 170 మంది బరిలో నిలిచారు. ఈసారి 12 శాతం అంటే 82 మంది తమ అదృష్టాన్నీ పరీక్షించుకుంటున్నారు.

మరోవైపు ఈసారి బరిలో ఉన్న అభ్యర్థుల్లో 23 శాతం మంది నేరచరితులు కాగా 18శాతం మంది హేయమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. మొత్తం 695 మంది అభ్యర్థుల్లో 18శాతం అంటే 122 మందిపై హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలతో పాటు తీవ్రమైన నేరాల కేసులు ఉన్నాయి. తమకు శిక్షలు పడినట్లు ముగ్గురు అభ్యర్థులు వెల్లడించారు. అభ్యర్థులు తమ అఫడవిట్లలో ఇచ్చిన సమాచారం మేరకు నేర చరిత్ర, ఆర్థిక స్థితిగతులు, విద్య, లింగం తదితర వివరాలను ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ నివేదించింది. తమపై మహిళల మీద నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు 29 మంది అభ్యర్థులు వెల్లడించారు. వీరిలో ఒకరిపై ఐపీసీ 376 కింద అత్యాచారం కేసు ఉండగా 10 మందిపై విద్వేష ప్రసంగాలు చేసిన కేసులున్నాయి.

ఇదిలావుంటే, ఐదో దశ అభ్యర్థుల్లో 33శాతం మంది కోటీశ్వరులు ఉన్నారు. ప్రతి అభ్యర్థి సగటు ఆస్తి రూ.3.56 కోట్లు. టాప్ 3 సంపన్న అభ్యర్థుల ఆస్తి రూ.110 కోట్ల నుంచి రూ.212 కోట్ల వరకు ఉన్నట్లు తేలింది. కాగా, తమకు రుణాలు ఉన్నట్లు 47శాతం మంది అభ్యర్థులు తెలిపారు. కోట్లలో అప్పు ఉన్నట్లు కొందరు వెల్లడించారు. ఇక విద్యార్హతల విషయానికి వస్తే 42శాతం మంది ఐదవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వారు ఉంటే... 50శాతం మంది గ్రాడ్యుయేట్లు లేక అంతకంటే ఎక్కువ చదువుకున్న వారున్నారు. 26 మంది డిప్లొమా చేయగా, 20 మందికి చదవడం, రాయడం మాత్రమే తెలుసు, ఐదుగురు నిరక్షరాస్యులు కూడా ఉన్నట్లు ఏడీఆర్ పేర్కొంది.

ఆస్తుల్లో బీజేపీ అభ్యర్థులే టాప్

సంపన్నుల్లో పీయుష్ గోయల్, అనురాగ్ శర్మ

సార్వత్రిక ఎన్నికల ఐదవ దశ బరిలో నిల్చిన సంపన్న అభ్యర్థుల్లో బీజేపీ వారేదే అగ్రస్థానం. కోటీశ్వరుల్లో బీజేపీ నేతలు పీయుష్ గోయల్, అనురాగ్ శర్మతో పాటు నీలేశ్ భగవాన్ సంబారే టాప్ 3లో నిలిచినట్లు ఏడీఆర్ నివేదించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి బీజేపీ తరపున అనురాగ్ శర్మ పోటీ చేస్తున్నారు. ఆయన ఆదాయం రూ.13కోట్లు. చరాస్తి విలువ రూ.95.2కోట్లు, స్థిరాస్తి రూ.116.8 కోట్లు మొత్తం రూ.212 కోట్లు. ఈ మేరకు అఫిడవిట్‌లో శర్మ పేర్కొన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. అలాగే మహారాష్ట్రలోని భీవండి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నీలేశ్ భగవాన్ సంబారే పోటీ చేస్తున్నారు. ఆయన మొత్తం ఆస్తి రూ.116 కోట్లు. ఇందులో చరాస్తి రూ.32.7 కోట్లు, స్థిరాస్తి విలువ రూ.83.3 కోట్లు. అలాగే, బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్రలోని ఉత్తర ముంబై అభ్యర్థి పీయుష్ గోయల్ మొత్తం ఆస్తి రూ.110 కోట్లు. ఆయన చరాస్తి విలువ రూ.89.8 కోట్లు, స్థిరాస్తి రూ.21 కోట్లుగా ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. టాప్ 10 సంపన్న అభ్యర్థుల్లో ఎన్‌సీపీ శరద్ పవార్ పార్టీకి చెందిన సురేశ్ గోపినాథ్ (రూ.107 కోట్లు), కృష్ణానంద త్రిపాఠి-కాంగ్రెస్ (రూ.70కోట్లు), సంగీత కుమారి సింగ్- బీజేపీ (రూ.67కోట్లు), రవీంద్ర దత్తారాం వైకర్-శివసేన (రూ.54కోట్లు), కపిల్ మొరేశ్వర్ పాటిల్-బీజేపీ (రూ.49కోట్లు), కరణ్ భూషణ్ సింగ్-బీజేపీ (రూ.49కోట్లు), సంజయ్ మఫత్‌లాల్ మొరాఖియా-ఇండ్ (రూ.48కోట్లు) ఉన్నారు.

నిరుపేద అభ్యర్థులు... : అస్తులు లేని అభ్యర్థులలో మహమ్మద్ సుల్తాన్ గనాయే (రూ.67), ముకేశ్ కుమార్ (రూ.700), సురాజిత్ హేంబ్రమ్ (రూ.5,427) ఉన్నట్లు ఈసీఐ పేర్కొంది. అయితే వీరంతా స్వతంత్ర అభ్యర్థులు.

దిల్లీ హైకోర్టులో మోదీకి ఊరట

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మతపరమైన విభజన ప్రసంగాలు చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉల్లంఘించారని, ఆయనపై చర్యలకు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని, విచారణకు అర్హమైనది కాదని జస్టిస్ సచిన్ దత్తా తీర్పునిచ్చారు. పిటిషనర్లు చేసిన ఫిర్యాదును చట్టానికి అనుగుణంగా స్వతంత్రంగా అంచనా వేసి చర్య తీసుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉందని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేనందున తోసిపుచ్చుతున్నట్టు పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్టు ముందుగానే పిటిషనర్ ఒక నిర్ణయానికి రావడం పూర్తిగా అనుచితమని కోర్టు తెలిపింది. ప్రధానమంత్రి, ఇతర బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్లు వివరించారు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఈనెల 21న ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని వారు ప్రస్తావించారు. షహీన్ అబ్దుల్లా, అమితబ్ పాండే, దేవ్ ముఖర్జీ అనే ముగ్గురు హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. విద్వేష ప్రసంగాలు చేసిన రాజకీయ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు సహా తక్షణ చర్యలు తీసుకునేలా ఈసీఐని ఆదేశించాలని కోర్టును వారు కోరారు.

పాకిస్థాన్ అణుశక్తికి భయపడుతున్నారు

'ఇండియా' నాయకులపై ప్రధాని విమర్శలు

ముజఫర్‌పూర్/హాజీపూర్ : పాకిస్థాన్‌కు చెందిన అణు శక్తికి భయపడుతున్న 'పిరికివాళ్లు' ఇండియా కూటమి నాయకులని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం అన్నారు. బీహార్ ముజఫర్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించిన మోదీ, పేరు ప్రస్తావించకుండా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూక్ అబ్దుల్లా ఇటీవల చేసిన ప్రకటనకు స్పష్టమైన సూచన చేశారు. 'ఇండియా కూటమిలో పాకిస్తాన్‌కు భయపడే, దాని అణుశక్తికి చెందిన పీడకలలు కలిగిన నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది' అని అన్నారు. పాకిస్తాన్ అణు బాంబులు కలిగి ఉందని, గాజులు ధరించి లేదంటూ ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రధాని ఈ విమర్శలు చేశారు. 'పాకిస్తాన్ గాజులు ధరించకపోతే, మేము ఆ దేశం ధరించేలా చేస్తాము. వారికి ఆహార ధాన్యాలు లేవని నాకు తెలుసు. ఇప్పుడు వారికి గాజుల తగినంత సరఫరా కూడా లేదని నేను తెలుసుకున్నాను' అని ప్రధాని చెప్పారు. 'కానీ ఉగ్రవాదంపై పాకిస్తాన్‌కు క్లీన్‌చిట్ ఇచ్చే, సర్జికల్ స్ట్రైక్స్‌పై సందేహాలు లేవనెత్తే పిరికివాళ్లు, దుర్బలమైన వ్యక్తులతో నిండిన ప్రతిపక్షాలను మనం జాగ్రత్తగా చూడాలి' అని అన్నారు. అంతకుముందు, హాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించిన మోదీ, రాజకీయ నాయకులపై జరిపిన దాడుల్లో దొరికిన డబ్బు 'దేశ పేదలకు చెందినది' అని అన్నారు. 'ఈడీ వంటి దర్యాప్తు సంస్థల చర్యకు వ్యతిరేకంగా వారు ఎందుకు గట్టిగా ఏడుస్తున్నారో నేను మీకు చెబుతాను. మునుపటి కాంగ్రెస్ పాలనలో ఈడీ 35 లక్షల రూపాయలను మాత్రమే స్వాధీనం చేసుకుంది, దీనిని పాఠశాల సంచిలో కలిగి ఉండవచ్చు. మేము బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి దర్యాప్తు సంస్థ ద్వారా రూ.2,200 కోట్లను స్వాధీనం చేసుకుంది. దీనికి 70 చిన్న ట్రక్కులు తీసుకెళ్లవలసి ఉంటుంది' అని ప్రధాని చెప్పారు. తన ప్రత్యర్థుల మాదిరిగా కాకుండా 'నాకు 'వారిస్' (వారసుడు) లేరు. సామాన్య ప్రజలు నా వారిస్' అని అన్నారు.

ఈవీఎంల స్టోరేజీ గిడ్డంగిలో

45 నిమిషాలు సీసీటీవీలు బంద్

సుప్రియా సూలే

ముంబై: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఈవీఎంల భద్రతపై ఆ నియోజకవర్గం ఎన్‌సీపీ(ఎస్‌పీ) అభ్యర్థి సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు. ఓటింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరచిన గిడ్డంగిలో సోమవారం ఉదయం 45 నిమిషాల పాటు సీసీటీవీలు స్విచ్ఛాప్ చేశారని ఆమె ఆరోపించారు. బారామతి నియోజకవర్గంలో సుప్రియా సూలేపై ఆమె కజిన్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునీతా పవార్ పోటీ చేశారు. బారామతి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత ఈవీఎంలు ఉంచిన గోదాములో సీసీటీవీలను ఈరోజు ఉదయం 45 నిమిషాలు నిలిపేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాములో ఈ పరిణామం చోటుచేసుకోవడం అనుమానాస్పదంగా ఉంది. ఇది అది పెద్ద భద్రతా లోపమని సుప్రియ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల ప్రతినిధులను, అధికారులను, జిల్లా యంత్రాగాన్ని సంప్రదించినా సంతృప్తికరమైన జవాబు రాలేదని, ఈవీఎంలు ఉంచిన ప్రాంతంలో టెక్నీషియన్లు కూడా అందుబాటులో లేరని ఆమె తెలిపారు. ఈవీఎంల స్టోరేజీ స్టేటస్ తెలుసుకునేందుకు తన ఎన్నికల ప్రతినిధులను కూడా అనుమతించలేదని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వెంటనే దీనిని పరిగణనలోకి తీసుకుని సీసీటీవీలు క్లోజ్ కావడానికి కారణాలు వెల్లడించాలని ఆమె కోరారు. ఈ ఘటనకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఈవీఎంలు ఉంచిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాములోని సీసీటీవీ కెమెరాలు ఉదయం 10.30 గంటల నుంచి 11.15 నిమిషాల వరకూ స్విచ్ఛాప్ అయినట్టు సుప్రియ ఎన్నికల ప్రతినిధి లక్ష్మీకాంత్ ఖబియా తెలిపారు. సీసీటీవీలు 24 గంటలూ పనిచేస్తాయని ఎన్నికల అధికారులు చెప్పారని, తమ ప్రతినిధులు అక్కడే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని ఖబియా చెప్పారు. అయితే సోమవారం సీసీటీవీలు 45 నిమిషాల పాటు నిలిచిపోయినట్టు తమకు సమాచారం వచ్చిందని, పోలీసుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లడంతో పాటు బారామతి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు.

రిటర్నింగ్ అధికారి వివరణ

కాగా, గోదాము ఆవరణలో ఎలక్ట్రిక్ పనుల కారణంగా స్వల్పవ్యవధి పాటు కెమెరాల కేబుల్‌ను తొలగించినట్టు ఎన్నికల అధికారులు వివరణ ఇచ్చారు. దీనిపై బారామతి రిటర్నింగ్ అధికారి కవిత ద్వివేది మాట్లాడుతూ ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఫిర్యాదుపై విచారణ చేశామని, గోదాములోని ఒక కేబుల్‌ను ఎలక్ట్రీషియన్ తొలగించడంతో డిస్‌ప్లే యూనిట్ షట్‌డౌన్ అయినట్టు తెలిసిందని చెప్పారు.

'ప్రజ్వల్ మా అమ్మపై అత్యాచారం చేశాడు'

బలవంతంగా నా దుస్తులూ విప్పించాడని 'సిట్' అధికారుల ఎదుట మహిళ వాంగ్మూలం

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల వేళ హసన్ సెక్స్ కుంభకోణం కర్నాటకలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదు చేసిన ఓ మహిళ... హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి షాకింగ్ విషయాలను బయటపెట్టింది. తన తల్లిపై నాలుగైదేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆ మహిళ ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అంతేకాదు, ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించాడని తెలిపింది. 'ఆయన మా అమ్మ ఫోన్‌కు కాల్ చేసి... వీడియో కాల్‌లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే... నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు' అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ప్రజ్వల్, హెచ్‌డీ రేవణ్ణ తన తల్లిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపింది. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించి తనపై, తన తల్లిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే... తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని... కేవలం ముగ్గురు మాత్రమే వారి దారుణాలను బయటపెట్టారని చెప్పింది. ఈ ఘటన అనంతరం తమ భూమిని కూడా బలవంతంగా అమ్ముకోవాల్సి వచ్చిందని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రజ్వల్ రేవణ్ణ, ఆయన తండ్రిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. హెచ్‌డీ రేవణ్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఈ నెల 14 వరకు జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. మరోవైపు ప్రజ్వల్ ఈ ఘటన వెలుగులోకి వచ్చిన మొదట్లోనే దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే.

నిజ్జర్ హత్య కేసుపై విలువైన సమాచారం అందలేదు: జైశంకర్



న్యూదిల్లీ: నిజ్జర్ హత్యకేసుకు సంబంధించిన విలువైన సమాచారం ఏదీ భారత్ చేతికి అందలేదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి కెనడా ప్రభుత్వం నాలుగో వ్యక్తిని అరెస్టు చేయడంపై సోమవారం ఆయన ఓ విలేకర్ల సమావేశంలో స్పందించారు. నిజ్జర్ హత్యపై కెనడా నుంచి ఎటువంటి విలువైన సమాచారం అందినా భారత్ కచ్చితంగా దానిపై దర్యాప్తు చేసేదన్నారు. 'అసలు మాకు ఇంత వరకు ఏ సమాచారం అందలేదు. ఆ కేసుకు సంబంధించి గత కొన్ని రోజుల్లో ఏ కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయో నాకు తెలియదు. సాధారణంగా విదేశీయులను అరెస్టు చేస్తే కాన్సులర్ విధానాల్లో భాగంగా ఆ దేశ దౌత్య కార్యాలయానికి సమాచారం అందించాలి. వాస్తవానికి భారత్-కెనడా మధ్య చర్చలు జరిగాయి. మీరు వేర్పాటువాదులు, నేరగాళ్లు, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారని చెప్పాం. వారిలో చాలా మందిని భారత్‌కు అప్పగించాలని కోరాం. మా దౌత్యవేత్తలకు పొంచి ఉన్న ముప్పుపై వారి వద్ద పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాం' అని జై శంకర్ పేర్కొన్నారు. నెహ్రూ వైఖరి కారణంగా చైనాతో తలెత్తిన సరిహద్దు వివాదానికి కాంగ్రెస్... మోదీని నిందిస్తోందని జైశంకర్ పేర్కొన్నారు. 'భారత్ నుంచి 1958-62 మధ్యలో చైనా చాలా భూమిని లాక్కొంది. కానీ, కాంగ్రెస్ వాళ్లు మాట్లాడే సమయంలో తప్పుదోవ పట్టించేలా చైనా భూమి ఆక్రమించిందనే చెబుతారు. కానీ, అది 1962లో లాక్కొన్న భూమి అని వెల్లడించరు. వారి తప్పు లేదన్నట్లే ఉంటారు. చైనా వైపు నుంచి సవాళ్లున్నాయి. ఆ దేశం ఒప్పందాలను ఉల్లంఘిస్తోంది. సరిహద్దుల్లో భారీగా సైనికులను మోహరించింది. ఓ పక్క కోవిడ్‌ను ఎదుర్కొంటూనే మన దేశం సరిహద్దుల్లో మోహరింపులు జరిపింది. దేశం మన సైన్యానికి మద్దతుగా ఉండాలి. మీ సైనికులను, ప్రజలను తక్కువ చేయడం బాధాకరం' అని వెల్లడించారు. భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇచ్చే విషయంపై ఆశాభావంగా ఉన్నట్లు జైశంకర్ వెల్లడించారు. దానిపై చర్చలు ఊపందుకొన్నాయని చెప్పారు. ప్రపంచ దేశాలు భారత అభ్యర్థిత్వానికి మద్దతునిస్తున్నాయని అన్నారు.

స్ట్రెచ్చర్‌పై వచ్చి ఓటేసిన క్యాన్సర్ బాధితురాలు

పాట్నా: బీహార్‌కు చెందిన సుభద్రాదేవి క్యాన్సర్‌తో పోరాడుతూనే సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకొని పౌరులందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆమె కొన్నాళ్లుగా క్యాన్సర్ కారణంగా లేవలేని స్థితిలో ఉంది. అధికారుల వివరాల మేరకు... చౌగ్మా ప్రాంతానికి చెందిన సుభద్రాదేవి తన ఓటును వినియోగించుకోవాలనుకున్నారు. తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే ఆశయంతో కుటుంబసభ్యుల సహాయంతో స్ట్రెచ్చర్‌పై వచ్చి దర్భాంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమె కుమారుడు విజయ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ 'మా అమ్మ చాలాకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఎక్కువ కాలం బతకనని తెలిసినా తన జీవితంలోని చివరి రోజుల్లోనూ తన కర్తవ్యాన్ని మరిచిపోలేదు. ఈ రోజు మా అమ్మ ఓటు వేసింది. ఆమె గత కొద్ది రోజులుగా నీరు మాత్రమే తీసుకుంటోంది. తన చివరి కోరికగా ఓటు వేయడానికి తీసుకెళ్లమని మమ్మల్ని అడిగింది. అధికారుల సహాయంతో ఆమె ఆశయం నెరవేర్చాం' అని తెలిపారు.

అంతా ప్రశాంతం

న్యూఢిల్లీ:

సార్వత్రిక ఎన్నికల నాల్గవ విడత పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 63 శాతం పోలింగ్ నమోదయింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ విడతలో 10 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు 62.31 శాతం ఓటింగ్ నమోదయింది. అయితే 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు జమ్మూ కశ్మీర్‌లో అత్యల్ప ఓటింగ్ శాతం నమోదయింది. 35.75 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం నమోదయింది. ఆంధ్రప్రదేశ్‌లో భారీగా 68 శాతం వరకు పోలింగ్ జరిగింది. బీహార్‌లో 54.14 శాతం, జార్ఖండ్‌లో 63.14 శాతం, మధ్యప్రదేశ్‌లో 68.01 శాతం, మహారాష్ట్రలో 52.49 శాతం, ఒడిశాలో 62.96 శాతం, తెలంగాణలో 61.16 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 56.35 శాతం పోలింగ్ నమోదయింది.

కాగా, బీహార్‌లోని దర్భం జిల్లాలో చౌగ్మా గ్రామానికి చెందిన సుభద్రా దేవి క్యాన్సర్‌తో పోరాడుతూ ఓటు హక్కు వినియోగించుకున్నది. యువతకు స్ఫూర్తిగా స్ట్రెచర్‌పై వచ్చి ఓటు వేసింది. సమస్తిపూర్ జిల్లాలోని ఉజియార్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన యువకుడికి ఇటీవలే ఓటు హక్కు వచ్చింది. దాంతో తన తొలి వేటు ఎప్పటికీ గుర్తుండాలని వినూత్నంగా ఆలోచించాడు. నల్ల చొక్కా, గ్రే కలర్ ప్యాంట్ ధరించి, తలకు ఆకుపచ్చ తలపాగా చుట్టి దున్నపోతుపై పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశాడు.

హింసాత్మక ఘటనలు... వివాదాలు

తెలంగాణలోని హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి కె.మాధవీలత వివాదంలో చిక్కుకున్నారు. ఆన్‌లైన్‌లో కనిపించిన వీడియో దృశ్యం ఆధారంగా ఎన్నికల అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు. అందులో బురఖా ధరించిన మహిళా ఓటర్లను ఫొటో గుర్తింపు కార్డులతో పోల్చడానికి ఆమె వారి ముఖాలు చూపించమని కోరినట్లు కనిపించింది. ఇక లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా పల్నాడు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అధికార వైసీపీ, టీడీపీ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ హింసకు పాల్పడ్డాయి. వేమూరు, దర్శి, ఇచ్ఛాపురం, కుప్పం, మాచర్ల, మార్కాపురం, పాలకొండ, పెదకూరపాడు సహా అనేక అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రత్యర్థి టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిందని వైసీపీ ఈసీకి లేఖ రాసింది. ఈవీఎంలు సక్రమంగా లేవని చాలాచోట్ల నుంచి సమాచారం అందిందని, లేదంటే మెషీన్లు స్టార్ట్ కావడానికి సమయం పట్టిందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. బీజేపీ అబద్ధాల ద్వారా గెలవాలని భావిస్తోందని, కానీ ప్రజలు ఓటుతో ఓడిస్తారని, ఏడో తేదీ తర్వాత ప్రజల ఆగ్రహం తారస్థాయికి చేరుకుంటుందని తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌లోని ఎనిమిది పార్లమెంటరీ నియోజకవర్గాలలో జరిగిన ఎన్నికల్లో చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. బీర్భూమ్, బర్ధమాన్-దుర్గాపూర్ లోక్‌సభ స్థానాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో టీఎంసీ, బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. రాష్ట్రంలో ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల సంఘం పేర్కొన్నప్పటికీ... ఈవీఎంలు పనిచేయక పోవడం, ఏజెంట్లను బూత్‌లలోకి రాకుండా ఆపడంపై వివిధ రాజకీయ పార్టీల నుంచి 1,088 ఫిర్యాదులు అందాయి. కృష్ణానగర్ నియోజకవర్గంలోని చాప్రా ప్రాంతంలో కూడా బీజేపీ కార్యకర్తలను టీఎంసీ కార్యకర్తలు కొట్టారనే ఆరోపణలతో ఉద్రిక్తత నెలకొంది. గాయపడిన ఇద్దరితో పాటు బీజేపీ అభ్యర్థి అమృతరాయ్ చాప్రా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఆరోపణలను టీఎంసీ ఖండించింది. మరోవైపు, ఉత్తర ప్రదేశ్‌లో రోడ్డు, అభివృద్ధి లేకపోవడానికి నిరసనగా షాజహాన్‌పూర్‌లోని కొన్ని గ్రామాలలో ప్రజలు ఎన్నికలు బహిష్కరించారు. ఒడిశాలోని అనేక చోట్ల ఈవీఎం లోపాలు బయట పడ్డాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఒడిశాలో ఇద్దరు పోలింగ్ అధికారులను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసినట్లు ప్రధానఎన్నికల అధికారి తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని మారుమూల సోనాపి, మోరంగ్‌పొంగా ప్రాంతాలకు వెళ్లే రహదారిని చెట్టును నరికివేయడం, అడ్డుకోవడం ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఓటరు ప్రవేశాన్ని అడ్డుకునేందుకు మావోయిస్టులు చేసిన ప్రయత్నాన్ని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. జమ్మూకశ్మీర్‌లో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అబ్దుల్లా కుటుంబానికి చెందిన మూడు తరాల వారు ఓటు వేశారు. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు, ఆంధ్ర ప్రదేశ్‌లో 25 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లో 13, బీహార్‌లో 5, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, పశ్చిమ బెంగాల్‌లో 8 స్థానాలకు, జమ్మూకశ్మీర్‌లో ఒక స్థానానికి పోలింగ్ జరిగింది. లోక్‌సభ ఎన్నికల మూడో దశ వరకు 543 స్థానాలకుగాను 283 స్థానాల్లో పోలింగ్ జరిగింది. నాల్గవ విడత తర్వాత 379 స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. తొలి మూడు దశల్లో వరుసగా 66.14 శాతం, 66.71 శాతం, 65.68 శాతం ఓటింగ్ నమోదయింది. తదుపరి మూడు దశలకు మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది.

సోరెన్‌కు బెయిల్ నిరాకరించిన సుప్రీం

న్యూఢిల్లీ:



జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భూ కుంభకోణంతో సంబంధం గల మనీల్యాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్ జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో జార్ఖండ్ ముక్తి మోర్చా తరపున ప్రచారంలో పాల్గొనేందుకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సోరెన్ అభ్యర్థన పెట్టుకున్నారు. దిల్లీ సీఎం కేజ్రీవాల్ తరహాలో తనకు కూడా బెయిల్ ఇవ్వాలని వేడుకున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం అందుకు నిరాకరిచింది. సోరెన్ తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అరునబ్ చౌదరీ వాదించారు. అయితే ఈ కేసు తదుపరి విచారణ మే 17వ తేదీన ఉంటుందని ధర్మాసనం పేర్కొన్నది. మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సీఎంగా ఉన్న సోరెన్ ... రికార్డులు మార్చివేసి... అక్రమ రీతిలో ఖరీదైన భూములు సొంతం చేసుకున్నట్లు హేమంత్ సోరెన్‌పై ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ముస్లిం ఓటర్లపై అనుచిత ప్రవర్తన

బీజేపీ అభ్యర్థి మాధవీలతపై కేసు

హైదరాబాద్:

కొందరు ముస్లిం ఓటర్ల పట్ల బీజేపీ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి కె.మాధవీ లత అనుచితంగా ప్రవర్తించారు. బురఖా ధరించిన కొందరు ముస్లిం ఓటర్లను ఓటరు ఐడికార్డులపై ఉన్న ఫొటోలతో సరిపోల్చాలంటూ బురఖా తొగించాలని కోరారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమె హైదరాబాద్ నియోజకవర్గం నుండి ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీపై పోటీ పడుతున్నారు. ఈ వీడియోపై అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల కమిషన్(ఈసీ)కి ఫిర్యాదు చేశారు. ఓటు వేసిన తర్వాత అనేక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన మాధవీలత, అజంపూర్‌లోని పోలింగ్ బూత్‌లో ఆగి, అక్కడ ఓటు వేయడానికి వేచి ఉన్న మహిళల ఐడీలు తనిఖీ చేయడం ప్రారంభించారు. ఒక వీడియోలో, ఆమె బురఖా ధరించిన స్త్రీని తన ముసుగు తీయాలని అడుగుతున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఐడీ కార్డులను సరిగ్గా తనిఖీ చేసిన తర్వాతే ఓటింగ్‌కు అనుమతించాలని మాధవీలత పోలింగ్ అధికారులను హెచ్చరించారు.

ఉమర్ ఖాలీద్ బెయిల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ:

2020 ఈశాన్య దిలీలో మతపరమైన అల్లర్ల వెనుక పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించిన కేసులో నిందితుడిగా ఉన్న జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్‌పై దిల్లీ కోర్టు సోమవారం తన నిర్ణయాన్ని మే 28కి రిజర్వ్ చేసింది. ఖాలీద్‌పై కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ) కింద కేసు నమోదు కాగా, సెప్టెంబరు 2020 నుంచి జైలులో ఉన్నాడు. ప్రత్యేక కోర్టులో ఖాలీద్ రెండో బెయిల్ పిటిషన్‌ను విచారించిన అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్ ఈ నెల 28న ఉత్తర్వులు వెలువరించనున్నట్లు తెలిపారు. ఖాలీద్ విజ్ఞప్తికి వ్యతిరేకంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ లిఖితపూర్వకంగా తన వాదనలు వినిపించారు. బెయిల్ విచారణలను ప్రభావితం చేయడానికి సోషల్ మీడియా కథనాలను సృష్టించడం ఖాలీద్‌కు అలవాటు ఉందని అతని వాట్సాప్ చాట్ వెల్లడించిందని కోర్టుకు తెలిపారు. ఖాలీద్ తరపు న్యాయవాది ఈ వాదనను తిప్పికొడుతూ, వాట్సాప్ మెసేజ్‌లను షేర్ చేయడం నేరమా లేక ఉగ్రవాద చర్యా అని అడిగారు.

ఇండియా కూటమి శ్రేణులకు అభినందనలు

ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

గుంటూరు పార్లమెంటుతో పాటు 175 శాసనభ, 25 పార్లమెంటు నియోజక వర్గాలకు ఇండియా కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల విజయం కోసం త్రికరణ శుద్ధిగా పనిచేసిన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి భాగస్వామ్య కార్యకర్తలకు, నాయకులకు సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. మండు వేసవిని లెక్కచేయకుండా గత 20 రోజులుగా ప్రచార కార్యక్రమంలో పాల్గొని, మోదీ నియంతృత్వ విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యపర్చడంలో అలుపెరగని పోరాటం చేసిన ఇండియా కూటమి శ్రేణులందరికీ ముప్పాళ్ళ అభినందనలు తెలియజేశారు.

స్వాతీమాలీవాల్‌పై కేజ్రీవాల్ సహాయకుడి దాడి

న్యూఢిల్లీ:

ఆప్ రాజ్యసభ ఎంపీ, దిల్లీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ స్వాతీమాలీవాల్... దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహాయకుడు తనపై దాడి చేశారని ఆరోపించారు. దానికి సీఎం నివాసం వేదిక అయింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం... ముఖ్యమంత్రి నివాసం నుంచి ఉదయం 9.30 గంటల సమయంలో పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. కేజ్రీవాల్ సన్నిహితుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేశారని స్వాతి ఫోన్‌లో చెప్పినట్లు తెలుస్తోంది. సీఎం సూచన మేరకే ఈ దాడి జరిగిందని ఆమె వెల్లడించినట్లు సమాచారం. దాంతో పోలీసులు సివిల్ లైన్స్‌లో ఉన్న సీఎం నివాసానికి చేరుకున్నారు. అయితే అక్కడ ఆమె కనిపించలేదు. కొద్దిసేపటికి స్టేషన్‌కు వచ్చిన ఆమె... తర్వాత ఫిర్యాదు చేస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇటీవల కాలంలో బిభవ్ కుమార్ వార్తల్లో నిలిచారు. ఆయన నియామకం చట్టవిరుద్ధమని పేర్కొంటూ సీఎం వ్యక్తిగత కార్యదర్శి హోదా నుంచి దిల్లీ విజిలెన్స్ విభాగం కుమార్‌ను తొలగించిన సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులోను ఈడీ ఆయనకు సమన్లు ఇచ్చింది. ఈ దాడి వార్తలపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'దిల్లీ సీఎం సహాయకుడు దాడి చేశారని ఆప్ ఎంపీ స్వాతీమాలీవాల్ ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇంటి నుంచి పోలీసులకు కాల్ వెళ్లింది. ఇప్పుడు మీకు ఈ విషయాలు గుర్తుకువస్తున్నాయా... కేజ్రీవాల్ అరెస్టుపై ఆమె మౌనం వహించారు. అప్పుడు ఆమె భారత్‌లో కూడా లేరు. చాలా రోజుల పాటు స్వదేశానికి తిరిగి రాలేదు' అని మాలవీయ ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. దీంతో మద్యం కుంభకోణం కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీ మరో వివాదంలో చిక్కుకుంది.

ప్రభుత్వ సానుకూలత

ఉప్పెనలా ఓటెత్తింది

- మెండుగా మహిళల ఆశీస్సులు
- టీడీపీ గూండాల విచ్చలవిడి దాడులు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

వైసీపీ ప్రభుత్వానికి మరోసారి సానుకూల ఫలితాలు వస్తున్నాయని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పోటెత్తగా, 2024 ఎన్నికల్లో సానుకూలత ఓట్లు ఉప్పెనలా వచ్చాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సజ్జల మాట్లాడుతూ... ప్రజలు ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చారని, మహిళల ఆశీస్సులు వైసీపీకి మెండుగా నిలిచాయని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా సానుకూలత ఓటుతో క్యూ కట్టారని వివరించారు. పేదల కోసం సీఎం జగన్ ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ గూండాలు విచ్చలవిడిగా దాడులకు తెగబడ్డారన్నారు. పల్నాడు జిల్లాలో ఏకపక్షంగా దాడులు చేశారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడమే తమకు కావాలని ఎంతో సమన్వయంతో వ్యవహరించామని స్పష్టంచేశారు. మా విజయంపై ఎలాంటి అనుమానాలు లేవన్నారు. అధికారంలో మేమే ఉన్నప్పటికీ, తమపై దాడులు, కవ్వింపు చర్యలను టీడీపీ చేపట్టిందన్నారు. ఎన్నికల సమయం ముగిసినప్పటికీ... ఇంకా పోలింగ్ బూత్‌ల దగ్గర ప్రభుత్వ సానుకూలత చెక్కుచెదరలేదన్నారు. మాచర్ల, టెక్కలి, వేమూరు, గుంటూరు వెస్ట్, అద్దంకి, పొన్నూరు, అమలాపురం, వినుకొండ, సత్తెనపల్లిలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. టీడీపీ కార్యకర్తలు చాలా చోట్ల దాడులకు దిగారని, వైసీపీ నేతలు తీవ్రంగా గాయాలకు గురయ్యారని వివరించారు. దాదాపు 80 ఘటనలపై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నాటకాలను, దాడులను చూశామని, ఈ అరాచకాలను తీసుకెళ్లామని పేర్కొన్నారు. పోలింగ్ రోజుకు ముందూ... అడ్డగోలుగా అధికారులను బదిలీ చేశారన్నారు. విచ్చలవిడిగా వ్యవస్థలను వినియోగించుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూశారన్నారు.

ఓటమి భయంతోనే

వైసీపీ దాడులు

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

ఓటమి భయంతోనే పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. జగన్ అరాచక, అవినీతి పాలనకు గుడ్ బై చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారనడానికి తెల్లవారుజాము నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడమే నిదర్శనమన్నారు. ప్రజల్లో వచ్చిన తిరుగుబాటుతో ఓటమి కళ్లకు కనిపిస్తుండడంతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులతో పాటు మీడియాపై, పోలీసులపై, మహిళా ఓటర్లు, మహిళా నేతలపై దాడులకు తెగబడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. 'మాచర్లలో టీడీపీ నేత జూలకంటి బ్రహ్మారెడ్డితోపాటు వందల సంఖ్యలో కార్యకర్తలను రక్తం వచ్చేలా కొట్టారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలుపై వైసీపీ మూకలు దాడి చేసి, కార్లను ధ్వంసం చేశారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు టీడీపీ నేతలపై, ఓటర్లపై కూడా దాడులకు పాల్పడడం హేయనీయం. గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్యను అభివృద్ధి గురించి ప్రశ్నించినందుకు మహిళలపైకి కారుతో దూసుకెళ్లడం వైసీపీ నేతల దురహంకారానికి నిదర్శనం. చీరాలలో టీడీపీ అభ్యర్థి ఎం.ఎం.కొండయ్యపై దాడికి పాల్పడ్డారు. శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్‌పై పోలింగ్ బూత్ వద్దే దాడికి పాల్పడడం దుర్మార్గం. తిరువూరు నియోజకవర్గం కంభంపాడులో కేశినేని చిన్ని బృందంపై వైసీపీ మూకలు వెంటాడి మరీ దాడి చేశారు. కార్లు ధ్వంసం చేశారు. పోరంకి పోలింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీకి ఓట్లు ఎక్కువగా వేస్తున్నారని జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఏకంగా పోలింగ్ ఆపేయాలంటూ హడావుడి చేశాడు. కుర్చీలు విసిరేసి వీరంగం సృష్టించాడు. ఇలా ఎక్కడికక్కడ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. తెనాలిలో క్యూ లైన్‌లో రావాలన్నందుకు ఓటరుపై ఎమ్మెల్యే శివకుమార్, అతని కుమారుడు దాడి చేయడం వైసీపీ అరాచకానికి పరాకాష్ఠ. పోలింగ్ కేంద్రాల వద్ద భయానక పరిస్థితులు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలన్న వైసీపీ నేతల కుట్రలను పోలీసులు ఛేదించాలి. దౌర్జన్యకారులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, ఆదివాసీలు బానిసలే: ఖడ్గే

హజారిబాగ్:

బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే చెప్పారు. ఈసారి ప్రధాని మోదీ విజయం సాధిస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదని హెచ్చరించారు. జార్ఖండ్‌లోని హజారిబాగ్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఖడ్గే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయి. ప్రజలు ప్రమాదంలో ఉన్నారు. ప్రాథమిక హక్కులు లేకుంటే పౌరులు బానిసలుగా మారుతారు. ప్రత్యేకించి దళితులు, ఆదివాసీలను బానిసలను చేస్తారు. మోదీ మరోసారి విజయం సాధిస్తే భవిష్యత్తులో ఎన్నికలు నిర్వహించరు. హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. ఇదే విధంగా పారిశ్రామికవేత్తలను అరెస్టు చేసే ధైర్యం ఎందుకు చేయడం లేదు' అని మల్లికార్జున ఖడ్గే ప్రశ్నించారు. అదానీ, అంబానీ నుంచి టెంపోల కొద్దీ నల్లడబ్బు కాంగ్రెస్‌కు ఏమైనా అందిందా అని మోదీ ఇటీవల ప్రశ్నించడంపై ఖడ్గే ఈ విధంగా స్పందించారు. కేంద్రంలో విపక్షాల కూటమి 'ఇండియా' అధికారంలోకి వస్తే... ఇప్పటివరకు అరెస్టైన కూటమి నేతలందరికీ స్వేచ్ఛ లభిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ఏదేమైనా ఈసారి మోదీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి విరాళాలు ఇచ్చిన వారు కీలక కాంట్రాక్టులు పొందారని ఖడ్గే ఆరోపించారు.

అదానీ, అంబానీల కోసమే మోదీ: రాహుల్

అదానీ, అంబానీల కోసం పనిచేసే ప్రధాని మోదీలా తాము ఉండబోమని, రాయ్‌బరేలీ ప్రజల కోసం తన కుటుంబం నిరంతరం పనిచేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. రాయ్‌బరేలీలో మొదటిసారి ఎన్నికల సమావేశాన్ని రాహుల్ సోమవారం నిర్వహించారు. తన నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియాగాంధీ రాయ్‌బరేలీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని రాహుల్ చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పథకం కోసం 24 ఏళ్లకు కేటాయించిన నగదుకు సమానమైన రూ.16 లక్షల కోట్ల రుణాలను మోదీ ప్రభుత్వం కేవలం 22-25 పారిశ్రామిక వేత్తల కోసం మాఫీ చేసిందని మండిపడ్డారు. నిరుద్యోగ యువత, రైతుల సమస్యలను మీడియా పట్టించుకోవడం లేదని, పెట్టుబడిదారుల కుటుంబాల్లో పెళ్లి వేడుకలకు ప్రాముఖ్యతనిస్తోందని దుయ్యబట్టారు. గాంధీ కుటుంబానికి కంచుకోట అయిన రాయ్‌బరేలీ నియోజకవర్గానికి 2004 నుండి సోనియా గాంధీ ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆమె ప్రత్యక్ష ఎన్నికల నుండి తప్పుకున్నారు. దీంతో ఈ స్థానం నుండి రాహుల్ గాంధీ బరిలోకి దిగారు.

ముంబైలో కుప్పకూలిన భారీ హోర్డింగ్

- నలుగురి దుర్మరణం
- 50 మందికి పైగా గాయాలు
- ఈదురుగాలుల బీభత్సం

ముంబై:

దేశ ఆర్థిక రాజధాని ముంబై లో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. తేలికపాటి వర్షంతో పాటు బలమైన గాలులు వీయడంతో ఘట్కోపార్ ప్రాంతంలోని ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై పంత్‌నగర్ వద్ద పోలీస్ గ్రౌండ్ పెట్రోల్ పంప్‌లో భారీ హెూర్డింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో నలుగురు దుర్మరణం చెందారు. మరో 59 మంది గాయపడ్డారు. హోర్డింగ్ కింద అనేక మంది చిక్కుకుపోయారు. పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బృహన్ ముంబయి అధికారులు తెలిపారు. కూలిపోయిన హెూర్డింగ్ కింద సుమారు 100 మంది చిక్కుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. అయితే నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షంతోపాటు బలమైన ఈదురు గాలులకు తీవ్రస్థాయిలో దుమ్మురేగింది. భవనాలపైనుంచి హోర్డింగులు విరిగిపడ్డాయి. కొన్నిచోట్ల వైర్లు తెగిపోయాయి. దీంతో మెట్రోతోపాటు లోకల్ రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. కొన్నిచోట్ల దట్టమైన దుమ్ము ఎగిసిపడింది. అనేక ప్రాంతాల్లో స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో అనేక మార్గాల్లో మెట్రో సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. సబర్బన్ రైళ్లకూ అంతరాయం ఏర్పడింది. అనేక చోట్ల విద్యుత్తును నిలిపివేయాల్సి వచ్చింది. గాలి దుమారం తీవ్రతతో పాటు దృశ్య నాణ్యత పడిపోవడం వల్ల ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో గంటపాటు కార్యకలాపాలు నిలిచిపోయాయి. 15 విమానాలను దారిమళ్లించారు. సాయంత్రం 5 గంటల తర్వాత విమాన సేవలను పునరుద్ధరించారు. ముంబై, థానె, పాల్ఘర్, దాదర్, కుర్లా, మాహిమ్, ఘట్కోపార్, ములుండ్, విక్రోలితోపాటు దక్షిణ ముంబైలో కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలుల ప్రభావం కనిపించింది.

హోర్డింగ్ కూలిన ఘటనపై విచారణ

ఘట్కోపార్ ప్రాంతంలో భారీ బిల్‌బోర్డ్ కుప్పకూలి విపత్తు సంభవించిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్టు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. 'బిల్‌బోర్డ్ కింద చిక్కుకున్న 47 మందిని ఇంతవరకూ సురక్షితంగా బయటకు తెచ్చాం. యుద్ధప్రాతిపదికన ముంబై పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజిమెంట్ సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం' అని ఫడ్నవిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్ భూషణ్ గగ్రాని ఈ ఘటనపై మాట్లాడుతూ... సహాయక చర్యల నిమిత్తం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని కూడా రంగంలోకి దింపామని, గ్యాస్ కట్టర్లను కూడా ఘటనా స్థలికి పంపామని చెప్పారు. హెూర్డింగ్ కుప్పకూలిన ఘటనపై రైల్వే అండ్ అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ ఎగో మీడియాపై డిజాస్టర్ మేనేజిమెంట్ యాక్ట్ కింద బీఎంసీ ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కాగా క్షతగాత్రులను తక్షణ చికిత్స కోసం రాజావాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.